ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు - 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు - 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు - 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె - 9985411377

రైతు కష్టం వర్షార్పణం


కృష్ణనంది ప్రాంతంలో దెబ్బతిన్న అరటి చెట్టు


మహానందిలో నేలను తాకిన వరి పంట

- అకాల వర్షాలకు భారీగా పంటనష్టం
- జిల్లాలో 2,242 హెక్టార్లలో వరి
- 71 హెక్టార్లలో మొక్కజొన్న
- 13 హెక్టార్లలో జొన్న
- 27 హెక్టార్లలో అరటి పంటలకు నష్టం

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రేయింబవళ్లు కష్టపడిన రైతులకు కన్నీళ్లే మిగిలాయి. పంటచేతికొచ్చే సమయానికి అకాల వర్షం రైతు ఆశలను అతలాకుతలం చేసేసింది. కోతకు వచ్చిన వరి, కల్లాల్లో ఉన్న ధాన్యంతో పాటు కాపుకాసిన అరటి చెట్లు వర్షానికి నేలకొరిగాయి. నంద్యాల జిల్లాలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి తోడు ఈదురుగాలులు తోడు కావడంతో నిలువునా పంటలు నేలకూలి రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. దీంతో రైతులు అధికంగా సాగు చేసే అరటి, వరి పంటలు నేలవాలాయి. దీంతో రూ.లక్షల్లో పంట నష్టం వచ్చింది. పంటలపై పెట్టిన పెట్టుబడి కూడా రాకుండా ఆర్థికంగా ఇబ్బందులు పడే పరిస్థితి దాపురించింది. భారీ గాలులతో ఉద్యానపంటలతో పాటు వరి, మొక్కజొన్న, జొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వ్యవసాయాధికారులు వెల్లడించిన ప్రాథమిక అంచనాల ప్రకారం సంజామల మండలం గిద్దలూరు గ్రామ పరిధిలో అరటి 12 హెక్టార్లు, పేరుసోముల గ్రామ పరిధిలో 5 హెక్టార్లు, కొలిమిగుండ్ల మండలం చింతలాయపల్లె గ్రామ పరిధిలో 10 హెక్టార్లలో అరటి నేలకూలింది. అలాగే బండిఆత్మకూరు మండలంలో వరి 1,942 హెక్టార్లు, గడివేముల మండలంలో 70 హెక్టార్లు, మహానంది మండలంలో 212 హెక్టార్లు, వెలుగోడు మండలంలో 42 హెక్టార్లు, నంద్యాల మండలంలో 96 హెక్టార్లు, జూపాడు బంగ్లా మండలంలో 150 హెక్టార్లలో వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరి గింజలు పాలుపోసుకునే దశలో ఉండడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. అలాగే గడివేముల మండలంలో 10 హెక్టార్లు, జూపాడుబంగ్లా మండలంలో 41 హెక్టార్లలో మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. జూపాడుబంగ్లా మండలంలో 13 హెక్టార్లలో జొన్న పంటకూడా దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు నివేదికలను జిల్లా కలెక్టర్ రాజకుమారికి సమర్పించారు.


పడిపోయిన వరికి కట్టలు కడుతూ ఊతం ఇస్తున్న కూలీలు

నేలకొరిగిన వరి, అరటి పంట

మహానంది: మహానంది మండలంలో దాదాపు 30 హెక్టార్లల్లో అరటి పంట ఈదురుగాలులకు నేలకూలింది. అలాగే వరిపంట కూడా కోతకు వచ్చే సమయంలో దెబ్బతింది. ప్రతి ఏడాది ఇదే విధంగా జరగడంతో తాము నష్టాలను చూడాల్సిన పరిస్థితి వచ్చిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బండిఆత్మకూరు: మండలంలోని ఈర్నపాడు గ్రామంలో ప్రకృతి బీభత్సంతో దెబ్బతిన్న పంటలను శుక్రవారం కేసీ కెనాల్ ప్రాజెక్టు చైర్మన్, టీడీపీ నాయకులు బన్నూరు రామలింగారెడ్డి పరిశీలించారు. వెంగళరెడ్డిపేట గ్రామంలో దెబ్బతిన్న వరి పంటను సీపీఎం నాయకులు రత్నమయ్య, డేవిడ్, రాజు, రామచంద్రుడు, సుబ్బరాయుడు పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట వేలాది ఎకరాల్లో నేల వాలిందని, అరటి, మామిడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నష్టంపై నివేదికను ప్రభుత్వానికి తెలియజేస్తామని ఏవో స్వాతి తెలిపారు.

ఆలయంలో అర్ధరాత్రి సినిమా స్టెప్పులు..!

- ఆర్కెస్ట్రా అనుమతి పొంది రికార్డింగ్ డ్యాన్సులు
- పోలీసుల సమక్షంలోనే డీజే నృత్యాలు
- వైసీపీ నాయకులే నిర్వాహకులు

నంద్యాల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): భజన, భక్తిగీతాలు ఆలపించాల్సిన ఆలయంలో ఒక్కసారిగా సినిమా పాటలొచ్చాయి. డీజే శబ్దాలు.. ఆరుగురు యువతులు కిరాక్ డాన్స్.. భక్తిగీతాలు రావాల్సిన చోట ఇలా సినిమా పాటలు, అభ్యంతర డాన్సులకు వేదికైంది గోస్పాడు మండలం దిబగుండ్ల గ్రామంలోని వీరభద్రస్వామి ఆలయం. వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముందుగా ఆర్కెస్ట్రా అనుమతులు తీసుకున్నారు. కానీ అక్కడ మాత్రం సినిమా పాటలు, డీజే సౌండ్స్‌తో వ్యవహారం నడిచింది. అడ్డుకోవాల్సిన పోలీసులు సైతం ఆ డ్యాన్స్‌లను చూస్తూ అలా ఉండిపోయారు. దిబగుండ్ల గ్రామంలో వీరభద్రస్వామి, గుమ్మితి మల్లికార్జునస్వామి తిరునాళ్ల మహోత్సవంలో గురువారం రాత్రి నిబంధనలకు పాతరేసి ఆర్కెస్ట్రాకు అనుమతి తీసుకుని.. డీజే సౌండ్‌లతో రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. అర్ధరాత్రి వరకు రికార్డు డ్యాన్సులు నిర్వహించడంతో విసిగిపోయిన టీడీపీ నాయకులు, కొందరు గ్రామస్థులు పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో చాలాసేపటి తర్వాత పోలీసులు డీజేతో పాటు రికార్డింగ్ డాన్సులను నిలిపివేయించారు. పోలీసుల సమక్షంలోనే గంటల తరబడి డీజే, రికార్డు డ్యాన్సులతో పాటు ఈలలు, కేకలతో ఆ ప్రాంతాన్ని హోరెత్తించడం చూస్తే పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అసలు వైసీపీ నాయకులు నిర్వహించిన ఈ కార్యక్రమానికి అండగా నిలిచిన నాయకులు, పోలీసుల తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం: ఎస్పీ


సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ

నంద్యాల క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. నంద్యాల లోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని ఎస్పీ చాంబర్‌లో శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న పదిమంది పోలీస్ సిబ్బంది తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీలపై ఎస్పీకి విన్నవించారు. సమస్యల పరిష్కారానికి తగిన పరిష్కారం, ప్రాధాన్యం కల్పిస్తామని ఎస్పీ భరోసా కల్పించారు. విధి నిర్వహణలో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కోకుండా వారి సమస్యలను పరిష్కరించినప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తారన్నారు.

అక్రమార్కులపై చర్యలకు సిద్ధం?

- మూడోసారి విచారించిన అధికారులు
- కలెక్టర్ వద్దకు నివేదిక
- రుద్రవరం మేజర్ పంచాయతీ సర్పంచ్, ఉద్యోగుల్లో అలజడి

నంద్యాల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ నియోజకవర్గం రుద్రవరం మేజర్ పంచాయతీలో గత ఐదేళ్ల వైసీపీ పాలనతో రూ.1.88 కోట్లు దుర్వినియోగం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో ఈ ఏడాది ఫిబ్రవరి 1న 'ఏకమై కాజేశారు', మార్చి 5న 'వేటుకు రంగం సిద్ధం' కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ రాజకుమారి సదరు పంచాయతీలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణకు ఆదేశించారు. రెండు సార్లు విచారణ చేసినా సమగ్రంగా లేకపోవడంతో గత పది రోజుల క్రితం మరోసారి ప్రత్యేక అధికారుల ద్వారా విచారణకు ఆదేశించి అక్రమాల్లో అభియోగాలు పొందిన సదరు కార్యదర్శులు, ఉద్యోగులు, సర్పంచ్ వారం రోజులలోపు తగిన వివరణ ఇచ్చేలా ఆదేశించాలని చేయాలని ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే అభియోగాలు పొందిన ఐదుగురిలో ఒక కార్యదర్శి, ఒక జూనియర్ అసిస్టెంట్ మాత్రమే విచారణ అధికారులకు వివరణ ఇచ్చినట్లు తెలిసింది. మిగిలిన ఇద్దరు కార్యదర్శులు, సర్పంచ్ ఎలాంటి వివరణ ఇవ్వనట్లు తెలుస్తోంది. దీంతో విచారణ అధికారులు పంచాయతీలో జరిగిన అక్రమాలతో పాటు ఇద్దరు ఉద్యోగులు ఇచ్చిన వివరణ మిగిలిన వారు స్పందించిన తీరు తదితర అంశాలతో కూడిన సమగ్ర నివేదికను రెండు రోజుల క్రితం విచారణ అధికారులు సదరు జిల్లా పంచాయతీ అధికారికి అందజేసినట్లు ఆ శాఖ వర్గాల ద్వారా తెలిసింది. దీంతో సదరు అధికారి సైతం తగిన సమగ్ర నివేదికను గురువారం కలెక్టర్‌కు అందజేసినట్లు తెలిసింది. పంచాయతీలో జరిగిన అక్రమాలతో పాటు అక్రమాల్లో ఎవరెవరి పాత్ర ఎంత ఉంది?, వివరణ ఇచ్చిన అధికారుల్లో ఏ మేరకు స్పష్టత ఉంది..? సర్పంచ్‌తో పాటు మిగిలిన ఇద్దరు కార్యదర్శులు స్పందించిన తీరుపై కూడా లిఖిత పూర్వకంగా నివేదించినట్లు తెలిసింది. అయితే సర్పంచ్ స్పందించకపోవడంతో సర్పంచ్ చెక్‌పవర్ రద్దుతో పాటు వివరణ ఇవ్వని ఇద్దరు అధికారులపై శాఖాపరమైన చర్యల నిమిత్తం కమిషనర్‌కు సిఫారసు చేసేవిధంగా పేర్కొన్నట్లు తెలిసింది. అదేవిధంగా వివరణ ఇచ్చిన ఒక కార్యదర్శితో పాటు జూనియర్ అసిస్టెంట్ కూడా ఇచ్చిన వివరణలో కొన్ని లోపాలు ఉన్నట్లు సమాచారం. దీంతో వీరిపై కూడా చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. ఉద్యోగులు చేసిన నిధులు స్వాహా విషయమై రికవరీకి కూడా ఆదేశిస్తూ నివేదికలో పేర్కొన్నట్లు ఆ శాఖ వర్గాల ద్వారా తెలిసింది. వీటితో పాటు కొందరిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రుద్రవరం మేజర్ పంచాయతీలో జరిగిన అక్రమాలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనాలతో జిల్లా ఉన్నతాధికారులు కదలిక తేవడంతో పాటు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీంతో ఎవరిపై ఎలాంటి వేటు ఉంటుందోనని ఆయా ఉద్యోగులతో పాటు సర్పంచ్‌లో అలజడి మొదలైంది.


రుద్రవరం పంచాయతీ కార్యాలయం

నందికొట్కూరు మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా వీరం ప్రసాద్‌రెడ్డి


వీరం ప్రసాద్‌రెడ్డి

నందికొట్కూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌గా బొల్లవరం గ్రామానికి చెందిన వీరం ప్రసాద్ రెడ్డిని ఎంపిక చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా మార్కెట్ యార్డు చైర్మన్ల రెండో విడత జాబితాను ప్రభుత్వం విడుదల చేసింది. అందులో ఉమ్మడి జిల్లా నుంచి నందికొట్కూరు మార్కెట్‌యార్డుకు చోటు కల్పించారు. బొల్లవరం గ్రామానికి చెందిన వీరం ప్రసాద్‌రెడ్డి బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2014-19 మధ్య కాలంలో నందికొట్కూరు మండల ఎంపీపీగా ఉన్న సమయంలో రాష్ట్రంలో ఉత్తమ మండలంగా రెండోస్థానంలో నిలబెట్టారు. ఈ క్రమంలో అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు. ఎంపీపీగా ఆయన చేసిన సేవలను కేంద్రం గుర్తించింది. అభివృద్ధి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితర సేవలు అందించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నుంచి ప్రసాద్‌రెడ్డి పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వీరం ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ మార్కెట్ యార్డు సేవలను రైతులకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తామన్నారు. తనకు ఎంపికకు సహకరించిన టీడీపీ నేత మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్యకు కృతజ్ఞతలు తెలిపారు.

APRJC/పాలిటెక్నిక్
ఎంట్రన్స్ కోచింగ్ ఏప్రిల్ 02న ప్రారంభం
శ్రీ ఈశ్వరాస్
KSR డిగ్రీ కాలేజ్, బిర్లాగేట్, CN హాస్పిటల్ వెనుక, కర్నూలు. Cell: 94402 31403

మాయమవుతున్న హంద్రీ..!


నగరం మధ్యలో హంద్రీ కుచించుకుపోయిన నది...
నది బఫర్ జోన్‌లో నిర్మించిన అక్రమ భవనాలు

కర్నూలు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర తరువాత జిల్లాలో ప్రవహించే అతిపెద్ద నది హంద్రీ. పత్తికొండ మండలం పందికోన కొండల్లో ఒక పాయగా, చిన్నహుల్తి ఎగువన మరో పాయ (వంక)గా ప్రవహించి, దేవనకొండ మండలం అలారుదిన్నె సమీపంలో హంద్రీ నదిగా రూపాంతరం చెందుతుంది. దేవనకొండ, ఆస్పరి, గోనెగండ్ల, కోడుమూరు, కల్లూరు మండలాల్లో ప్రవహించి, కర్నూలు నగర శివారు జొహరాపురం బిడ్జి దిగువన తుంగభద్రలో కలుస్తుంది. నగరం మధ్యలో 5.40 కి.మీలు ప్రవహించే హంద్రీ వివిధ ప్రాంతాలలో 200 నుంచి 300 మీటర్ల వెడల్పు ఉండాలి. గరిష్ఠ వరద ప్రవాహం అంచుల (మ్యాగ్జిమమ్ ఫ్లడ్ లెవల్-ఎంఎఫ్ఎల్) నుంచి 50 మీటర్లు (150 అడుగులు) వరకు బఫర్ జోన్ ఉంటుందని జలవనరుల శాఖ ఎఫ్ఆర్ఎల్ డివిజన్ ఇంజనీర్లు తెలిపారు. కోడుమూరు మండలంలో మొదలైన వక్కెరు వాగు ప్యాలకుర్తి, పెంచికలపాడు, నెరవాడ, సలకాపురం, పెద్దపాడు మీదుగా ప్రవహిస్తూ కల్లూరు వద్ద హంద్రీలో కలుస్తుంది. నగరం పరిధిలో వక్కెరు వాగుగడ్డ వెడల్పు (బఫర్ జోన్) 30-50 అడుగుల వరకు ఉంటుందని ఇంజనీర్లు తెలిపారు. నగరంలో స్థిరాస్తుల విలువ భారీగా పెరగడం, నగరం మధ్యలో ఉండడంతో అక్రమార్కులు నది ఒడ్డు ప్రభుత్వ భూములపై కన్నేశారు. రాజకీయ నాయకుల అండతో దర్జాగా ఆక్రమించేశారు. కొందరైతే ఏకంగా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు కూడా చేస్తున్నట్లు తెలుస్తుంది.

- దర్జాగా కుడి, ఎడమ గట్ల ఆక్రమణ
- 338 ఆక్రమణల గుర్తింపు
- ఆక్రమణదారుల్లో ఓ బడా రియల్టర్
- పూర్తి వివరాలతో నివేదిక పంపిన జలవనరుల శాఖ ఇంజనీర్లు
- నది సరిహద్దు సర్వేలో వెలుగు చూసిన వాస్తవాలు

హంద్రీ కర్నూలు నగరం మధ్యలో 7.40 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. స్థిరాస్తుల విలువ భారీగా పెరగడంతో నది కుడి, ఎడమ గట్లు ఆక్రమణకు గురవుతున్నాయి. ఇష్టారాజ్యంగా నది ఒడ్డును చదును చేసి ఇళ్లు కట్టేస్తున్నారు. హంద్రీ ఆక్రమణలపై ఆంధ్రజ్యోతి పలు కథనాలు ప్రచురించింది. జలవనరుల శాఖ ఎఫ్ఆర్ఎల్ డివిజన్ ఇంజనీర్లు ఎట్టకేలకు స్పందించారు. జాయింట్ కలెక్టర్ నవ్య దృష్టికి తీసుకెళ్లారు. రెవిన్యూ అధికారులు, ఇరిగేషన్ ఇంజనీర్లు సంయుక్తంగా హంద్రీ సరిహద్దు గుర్తింపు సర్వే నిర్వహించారు. నదీ తీరం వెంబడి 338 ఆక్రమణలు గుర్తించారు. ఆక్రమణదారుల్లో నగరంలో పేరుమోసిన బడా రియల్టర్ ఒకరు ఉన్నారు. నది సరిహద్దుల్లో పిల్లర్లు నాటుతున్నారు. అధికారులు ఈ అక్రమణలు తొలగిస్తారా..? రాజకీయ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి వదిలేస్తారా..? వేచి చూడాలి.


హంద్రీ నది సరిహద్దులు గుర్తించి పిల్లర్లు నాటుతున్న ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది

338 ఆక్రమణలు గుర్తింపు

హంద్రీ నది కుడి, ఎడమ గట్లు ఎక్కడికక్కడే ఆక్రమణలకు గురయ్యాయి. 1997లో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో రెండుసార్లు లక్ష క్యూసెక్కులకు పైగా వరద రావడంతో నదీ తీర కాలనీలు ముంపుకు గురయ్యాయి. 2007లో మరోసారి వరద వచ్చి కాలనీలను ముంచేసింది. 2009లో ఊహించని వరదతో జనం భారీ నష్టాన్ని చవి చూశారు. వరద ముప్పు నుంచి ప్రజలను రక్షించాలనే లక్ష్యంగా ఫ్లడ్ వాల్ నిర్మాణాలకు రూ.150 కోట్లు మంజూరు చేశారు. పనులు మొదలు పట్టేందుకు వెళ్లిన ఇంజనీర్లకు ఆక్రమణలు అడ్డుగా నిలిచాయి. ప్రజా ప్రతినిధులు, రాజకీయ బడా నాయకులు సైతం ఆక్రమణదారులకే వత్తాసు పలికారు. ఫలితంగా పనులు మొదలు కాలేదు. నిధులు వెనక్కి వెళ్లాయి.


నదిలో అక్రమ నిర్మాణాలు...

మిగతా 6వ పేజీలో

బాలలతో పనులు చేయిస్తే చర్యలు

- కర్మాగారాల్లో మహిళలకు వసతులు కల్పించాలి
- కార్మిక,కర్మాగార, బాయిలర్స్ సర్వీసెస్ అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు


పాల్గొన్న అధికారులు, ఫ్యాక్టరీ యజమానులు, సీఐటీయూ,ఏఐటీయూసీ నాయకులు


మాట్లాడుతున్న గంధం చంద్రుడు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ పరిశ్రమలు, ఫ్యాక్టరీలు, వాణిజ్య సముదాయాలు, దుకాణాల్లో బాలలతో పనులు చేయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కార్మిక, కర్మాగార, బాయిలర్స్ సర్వీసెస్ అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు అన్నారు. శుక్రవారం కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలోని కార్మిక శాఖ, కర్మాగారాల శాఖ అధికారులు, ఫ్యాక్టరీ యజమానులు, సీఐటీయూ,ఏఐటీయూసీ నాయకులతో జిల్లా పరిషత్ సమావేశభవనంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహించాలన్నారు. ఏదైనా సంస్థల్లో పది లేదా ఆపైన కార్మికులు పని చేస్తుంటే నెల జీతం రూ.21 వేల లోపు ఉంటే ఈఎస్ఐ చట్టం కింద పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. పరిశ్రమలు, కర్మాగారాల్లో పని చేసే మహిళలకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటిని గుర్తించి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాయలసీమ జోన్ సంయుక్త కమిషనర్ ఎం.బాలునాయక్, విజయవాడ కమిషనరేట్ సంయుక్త కమిషనర్లు లక్ష్మీనారాయణ, ఏ.గణేషన్, సహాయక కమిషనర్ ఆదినారాయణ, ఉప కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి.
99854 02121
ఆంధ్రజ్యోతి పత్రిక కోసం సంప్రదించండి.
99854 11364

రక్తనిధి సేకరణ ఏదీ?


ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తం నిల్వ ఉంచిన ఫ్రిజ్‌లు

- సర్వజన ఆస్పత్రిలో రుధిర కొరత
- బ్లడ్ కాంపొనెంట్స్ మిషన్ లేక రోగుల అవస్థలు
- డోనర్ ఉంటేనే బ్లడ్ ఇచ్చే పరిస్థితి
- స్థాయి పెంచారు.. సౌకర్యాలు మరిచారు

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా సర్వజన ప్రభుత్వ ఆస్పత్రికి నిత్యం వేలసంఖ్యలో రోగులు వస్తుంటారు. రోగులకు సరైన సౌకర్యాలు లేక ప్రైవేట్‌ను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. బ్లడ్‌బ్యాంక్‌లో రక్తం నిల్వలు సమృద్ధిగా ఉంచాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. రక్తం కావాలంటే వెంట డోనర్‌ను పిలుచుకొని పోవాల్సిన పరిస్థితి నెలకొంది. బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది రక్తసేకరణ చేయకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. కేవలం ఆస్పత్రికి స్వచ్ఛందంగా వచ్చేవారితోనే రక్తం సేకరిస్తున్నారు. ఇదిలా ఉండగా రక్తసేకరణ కోసం శిబిరాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఆస్పత్రికి బస్సును ఏర్పాటు చేసింది. బ్లడ్ బ్యాంక్ సిబ్బంది ఈ బస్సుద్వారా రక్తశిబిరాలు నిర్వహించి రోగులకు అవసరమైన రక్తాన్ని సరఫరా చేయాల్సి ఉంది. రోగులకు అత్యవసర సమయంలో బ్లడ్ బ్యాంక్ సిబ్బంది చేతులెత్తేయడంతో ప్రైవేట్ రక్త కేంద్రాలకు రోగుల బంధువులు పరుగులుతీస్తున్నారు. నంద్యాలలో ప్రభుత్వ ఆస్పత్రితోపాటు విజయ బ్లడ్ కేంద్రం, నంద్యాల బ్లడ్ కేంద్రాలు రోగులకు రక్తాన్ని సరఫరా చేస్తున్నాయి. జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేకంగా బ్లడ్‌బ్యాంక్‌ను ఏర్పాటుచేసి డాక్టర్‌ను, స్టాఫ్ నర్సులు, సిబ్బందిని నియమించారు. 450 పడకల ఆస్పత్రిలో వంద యూనిట్లలోపే బ్లడ్ నిల్వ ఉండటం గమనార్హం. అంతేకాక ఏ-నెగెటివ్ బ్లడ్ ఆస్పత్రిలో అందుబాటులో లేదు. అలాగే బి-నెగెటివ్, ఏ, బి - నెగెటివ్‌లు ఒక్కొక్క యూనిట్ మాత్రమే అందుబాటులో ఉంది.



అలంకారప్రాయంగా రక్త సేకరణ బస్సు

వేసవి కావడంతో ముందుకు రావడం లేదు



ప్రస్తుతం ఎండ తీవ్రత ఉండటంతో దాతలు రక్తం ఇవ్వడానికి ముందుకురావడంలేదు. కాంపొనెంట్ మిషన్ లేకపోవడంతో అరుదుగా దొరికే రక్తం కోసం బయటకు పంపాల్సివస్తోంది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతాం. రోగులకు అవసరమైన రక్తం అందుబాటులో ఉంది. ఆయా విభాగాల వైద్యులు నేరుగా రక్తం కోసం బయటకు పంపుతున్నారు.
- డాక్టర్ లింగేశ్వరరావు, నంద్యాల

గత మూడు నెలల్లో రక్త సేకరణ ఇలా...

సర్వజన ప్రభుత్వ ఆస్పత్రిలో బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది గత మూడు నెలల్లో 7 సార్లు మాత్రమే రక్తసేకరణ శిబిరాలు నిర్వహించింది. జనవరి 13న రైతునగర్‌లో 31 యూనిట్లు, 18వ తేదీన బనగానపల్లెలో 30 యూనిట్లు సేకరించారు. ఫిబ్రవరి 11న కోవెలకుంట్ల ఆర్టీసీ సిబ్బందినుంచి 23 యూనిట్లు, 12వ తేదీన నంద్యాల ఆర్టీసీ సిబ్బంది నుంచి 48 యూనిట్లు, 14వ తేదీన బనగానపల్లె ఆర్టీసీ సిబ్బంది నుంచి 25 యూనిట్లు సేకరించారు. మార్చి 7న ఆస్పత్రిలోనే 12 యూనిట్లు, 16వ తేదీన ఎన్‌జీవో కాలనీలోని బ్యాంక్ కోచింగ్ సెంటర్‌ద్వారా 64 యూనిట్లు సేకరించారు.

కాంపొనెంట్స్ మిషన్ మరిచారా?

రక్తాన్ని వేరుచేసే అత్యంత విలువైన కాంపొనెంట్ మిషన్‌ను ఏర్పాటు చేయడం మరిచిపోయారు. రక్తంలోని ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్త కణాలు, ప్లాస్మా, ప్లేట్‌లెట్లను వేరుగా చేసే కాంపొనెంట్ మిషన్‌లేకపోవడంతో ప్రజలు ప్రైవేట్‌ను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేరుచేసిన కణాలను నిల్వ ఉంచేందుకు మిషన్లు ఉన్నాయే కానీ అవసరమైన కాంపొనెంట్ మిషన్‌లేకపోవడంతో ఇవి వృథాగా మారిపోయాయి. జిల్లా కేంద్రంలో ఆస్పత్రి స్థాయిని పెంచారేకానీ అవసరమైన కాంపొనెంట్ మిషన్‌ను కొనుగోలు చేయకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు.



నంద్యాలలోని బ్లడ్‌బ్యాంక్

సిల్వర్ సెట్-2025 నోటిఫికేషన్ జారీ

- రేపటి నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- మే 18న ప్రవేశ పరీక్ష


సిల్వర్ సెట్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రత్యేకత కలిగిన సిల్వర్ జూబ్లీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి సిల్వర్ సెట్ నోటిఫికేషన్‌ను రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు జారీ చేశారు. శుక్రవారం క్లస్టర్ యూనివర్సిటీలోని తన చాంబర్‌లో నోటిఫికేషన్‌కు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. 13 కోర్సుల్లో 280 సీట్ల భర్తీ కోసం ఈనెల 6 నుంచి 30 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని, మే 18న రాష్ట్రంలోని 14 పరీక్ష కేంద్రాల్లో ఆన్‌లైన్ పద్ధతిలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. బీఎస్సీలో 120 సీట్లు, బీజెడ్‌సీలో 80, బీఏ 40, బీకాం జనరల్ 20, కంప్యూటర్ అప్లికేషన్ కోర్సులో 20 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో 12 పరీక్ష కేంద్రాలు, కర్నూలు జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఎస్వీ వర్సిటీ పరిధిలోని జిల్లాలకు 35శాతం, ఆంధ్ర వర్సిటీ పరిధిలోని జిల్లాలకు 65 శాతం చొప్పున సీట్లు కేటాయిస్తామని తెలిపారు. అందులో విద్యార్థినులకు 33 శాతం రిజర్వేషన్ ఉన్నప్పటికీ ఓపెన్‌లో కూడా విద్యార్థినులకు సీట్ల భర్తీలో అవకాశం ఉంటుందని తెలిపారు. సమావేశంలో సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లస్టర్ వర్సిటీలో కొత్తగా 23 పీజీ కోర్సులు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీలో కొత్తగా 23 పీజీ కోర్సులను ప్రారంభించబోతున్నామని రిజి స్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన కొత్త కోర్సుల వివ రాలను వెల్లడించారు. డిగ్రీ పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థి ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఉన్నత విద్యలో కొత్త కోర్సులను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. దేశంలోనే ప్రత్యేక వసతులను ఏర్పాటైన క్లస్టర్ వర్సిటీపై విద్యార్థులకు అవగాహన ఎంతో అవసరమని చెప్పారు.

మార్కెట్ యార్డు అక్రమాలపై కలెక్టర్ సీరియస్

విచారణ చేయాలని జేడీకి ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంద్యాల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నంద్యాల మార్కెట్ యార్డులోని ఓ కీలక అధికారి దందాపై 'పైసా వసూల్..!' శీర్షికతో శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. సదరు యార్డులోని అక్రమాలపై కథనం రావడంతో సంబంధిత అధికారులపై కలెక్టర్ సీరియస్ అయ్యారని ఆశాఖ వర్గాల నుంచి తెలిసింది. పత్రికలో వచ్చిన అంశాలతో పాటు గతంలో జరిగిన ఆరోపణలపై సమగ్రంగా విచారణ చేసి సమగ్ర నివేదిక అందజేయాలని ఆశాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులను ఆదేశించారు. ఆ తర్వాత ఇచ్చిన నివేదిక ప్రకారం జాయింట్ కలెక్టర్ ద్వారా కూడా విచారణ చేయిస్తామని కలెక్టర్ తెలియజేశారు.

ప్రయాణం ఆటో..ఇటో..!

- ఆటో టాపుపై విద్యార్థుల ప్రయాణం
- చూసిచూడనట్లు వ్యవహరిస్తున్న ట్రాఫిక్, పోలీసులు


ఆటోలో పరిమితికి మించి కూర్చుని ప్రయాణం చేస్తున్న విద్యార్థులు, ప్రజలు

కోసిగి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణించడం ప్రమాదం. కానీ ఆటోల డ్రైవర్లు ప్రయాణికులను ఎక్కించుకొని రై..నా వెళ్తున్నారు. శుక్రవారం కోసిగి మండలం గౌడుగల్లు, జుమాల దిన్నె గ్రామాలకు వెళ్లే ఆటోలో డ్రైవర్ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నాడు. ఆటో టాప్‌పై విద్యార్థులనూ ఎక్కించుకున్నాడు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని పలువురు ప్రశ్నిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు ప్రయాణికులకు, డ్రైవర్లకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మాయమవుతున్న హంద్రీ..!

(5వ పేజీ తరువాయి)

అయితే.. నదీ ఆక్రమణలపై పలు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఆంధ్రజ్యోతి పలు కథనాలు ద్వారా వెలుగులోకి తెచ్చింది. ఇరిగేషన్ ఎఫ్ఆర్ఎల్ డివిజన్ ఈఈ నారాయణరెడ్డి, డీఈఈ రామకృష్ణారెడ్డి జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. జాయింట్ కలెక్టర్ నవ్య ఆదేశాలతో రెవిన్యూ, సర్వే, ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తే విస్తుగొలిపే వాస్తవాలు వెలుగు చూశాయి. కుడిగట్టు (రైట్ బ్యాంక్) వెంబడి 164, ఎడమ గట్టు (లెఫ్ట్ బ్యాంక్) వెంబడి 174 ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించారు. కబ్జా స్థలాల్లో మెజార్టీగా ఆర్‌సీసీ భవనాలు నిర్మించారు.

సర్వే నంబర్లు వారిగా గుర్తించిన హంద్రీనది కుడి, ఎడమ వైపు ఆక్రమణలు

సర్వే నంబరు	కుడి వైపు	ఎడమ వైపు
770/ఎఫ్	--	1
422/ఎ	--	--
424/ఏ	2	4
470/బి	145	33
498/ఎ	8	24
533	8	110
24	1	2
మొత్తం	164	174


హంద్రీ నది సరిహద్దులు గుర్తించి పిల్లర్లు నాటుతున్న ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది

రాష్ట్రంలోనే తొలిసారిగా నది సరిహద్దు పిల్లర్లు

జలవనరుల శాఖ పరిధిలోని కాలువలు సర్వే చేసి సరిహద్దు రాళ్ల ఏర్పాటు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఓ నదిని సర్వే చేసిన సరిహద్దులు గుర్తించి పిల్లర్లు ఏర్పాటు చేయడం రాష్ట్ర చరిత్రలోనే ప్రథమమని అధికారులు అంటున్నారు. దాదాపు రూ.16 లక్షల ఖర్చుతో పది అడుగులు ఎత్తు, నాలుగు వైపులు అడుగు మందంతో బలమైన స్టీల్ వినియోగించి సిమెంట్ పిల్లర్లు తయారు చేయించారు. రెవెన్యూ, సర్వే, ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి సరిహద్దు గుర్తిస్తున్నారు. భూమిలో ఐదు అడుగుల లోతులో సిమెంట్ పిల్లర్లు పాతుతున్నారు. పిల్లరు మధ్యలో ఉన్నది నది పోరంబోకు ప్రభుత్వ భూమి. ఆ పిల్లరు నుంచి 150 అడుగుల వరకు బఫర్ జోన్ ఉంటుంది. అక్కడి వరకు ఎలాంటి భవనాలు నిర్మించరాదని అధికారులు పేర్కొంటున్నారు.

హంద్రీ ఆక్రమణలు అరికట్టేందుకు సరిహద్దు పిల్లర్ల ఏర్పాటు

హంద్రీ నది కర్నూలు నగరం మధ్యలో 7.40 కి.మీ ప్రవహిస్తుంది. కుడి, ఎడమ గట్ల వైపు ఆక్రమణలు ఉన్నమాట నిజమే. రెవిన్యూ, సర్వే అధికారులతో కలసి నది సరిహద్దులు గుర్తించి పిల్లర్లు (ఆర్‌సీసీ దిమ్మెలు) నాటుతున్నాం. హంద్రీ నదిని ఆక్రమణల నుంచి కాపాడేందుకు జిల్లా అధికారుల ఆదేశాలతో ఈ చర్యలు తీసుకున్నాం. నది రెండు వైపుల 334 ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించాం. పూర్తి వివరాలతో ఉన్నతాధికారులకు నివేదించాం. పైఅధికారుల ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించే చర్యలు కూడా తీసుకుంటాం.
- బి. రామకృష్ణ, డీఈఈ, ఇరిగేషన్ ఎఫ్ఆర్ఎల్ డివిజన్, కర్నూలు



విస్తుగొలిపే వాస్తవాలు

- హంద్రీ కుడి గట్టు (రైట్ బ్యాంక్) వైపు 164 ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించారు. అందులో బడా రియల్టర్ ఒకరు సర్వే నంబరు 424/ఏ, 470/బి పరిధిలో 15 ప్లాట్లు వేసి పక్కా భవనాలు నిర్మించారని గుర్తించారు. సర్వే నంబరు.470/బిలో 25 ప్లాట్లలో బెస్‌మట్టం వరకు నిర్మాణాలు చేపట్టారని, ఇవన్ని ఆక్రమిత స్థలం, బఫర్ జోన్‌లో ఉన్నాయని గుర్తించి నివేదిక పంపించారు. సర్వే నంబరు.740/బి, 498/ఎ, 533, 24 పరిధిలో పలువు 1.25 సెంట్లలో పక్కా భవనాలు, రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు. వీరిలో కొందరికి రెవెన్యూ అధికారులు డి.పట్టా ఇచ్చినట్లు తెలుస్తుంది. ఓ వెంచర్ యజమాని 40 సెంట్లు హంద్రీ నది ప్రభుత్వ ఆక్రమించినట్లు కూడా గుర్తించారు.
- యడమ గట్టు (లెఫ్ట్ బ్యాంక్) వైపు 174 ఆక్రమణలు గుర్తించారు. మెజార్టీగా ఆర్‌సీసీ భవనాలు నిర్మించుకున్నారు. సర్వే నంబరు.770/ఎఫ్ పరిధిలో ఓ ఫైనాన్స్ సంస్థ భవనం కొంతభాగం హంద్రీ నది ఒడ్డున ఉన్నట్లు గుర్తించారు.

వెనుకబడిన జిల్లాలను అభివృద్ధి చేయాలి

రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



మాట్లాడుతున్న బొజ్జా దశరథ రామిరెడ్డి

నంద్యాల మున్సిపాలిటీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఏపీ అంటే అమరావతి, పోలవరమే కాదని, రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాల అభివృద్ధిపై దృష్టి సారించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. మే 31న నిర్వహించనున్న సిద్ధేశ్వరం అలుగు శంకుస్థాపన 9వ వార్షికోత్సవం సందర్భంగా ప్రభుత్వ విధానాలు -వెనుకబడిన ప్రాంతాల భవిత పేరుతో సమితి ఉపాధ్యక్షుడు వైఎన్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నంద్యాలలోని ఐఎంఏ సమావేశ భవనంలో ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. బొజ్జా మాట్లాడుతూ పాలకుల లోపభూయిష్ట విధానాల వల్ల రాయలసీమ సామాజికంగా ఆర్థికంగా వెనుకబాటుతనానికి గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంసీ కొండారెడ్డి, రైతు కూలీ సంఘం నాయకులు సుంకన్న ఎం.కృష్ణాపురం బాలీశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిప్యుటేషన్‌పై పనిచేయడానికి దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లా, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ కోసం అర్హులైన గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న మహిళా పోలీస్, సర్వే అసిస్టెంట్, వీఆర్వో, వార్డ్ రెవెన్యూ కార్యదర్శి, వార్డు ప్లానింగ్ రెగ్యులేషన్ సెక్రటరీలు ఈ నెల 7వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని సీపీవో హిమప్రభాకర్‌రాజు తెలిపారు. జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌లో ఐదుగురు, నియోజకవర్గాల్లో విజన్ యాక్షన్ ప్లాన్‌లో 35 మంది ఏడాది కాల పరిమితితో డిప్యుటేషన్‌పై పని చేయాలని తెలిపారు. దరఖాస్తులను 7వ తేదీ ఉదయం 11 గంటలలోపు సీపీవో కార్యాలయంలో అందజేయాలన్నారు. ఆ రోజే మధ్యాహ్నం 2 గంటలకు స్క్రీనింగ్, ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యాశాఖలో..

కర్నూలు ఎడ్యుకేషన్: కర్నూలులోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రం(డైట్)లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ఎఫ్ఎస్‌టీ డిప్యుటేషన్ ద్వారా భర్తీ చేయడానికి గానూ అర్హత గలిగిన ప్రభుత్వ జడ్పీ, మున్సిపల్ యాజమాన్య పాఠశాలలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు దరఖాస్తు చేసుకునేందుకు ఏపీ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈవో శామ్యూల్ పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉండి అర్హత కలిగిన వారు ఈ నెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలన్నారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తు ప్రింట్ తీసుకుని దానికి అర్హత ధ్రువీకరణ జిరాక్స్ కాపీలను జతపరిచి సంబంధిత హెచ్‌ఎంలు, ఎంఈవోలు, ఉప విద్యాశాఖ అధికారి ద్వారా దరఖాస్తును స్వీకరించి డైట్ కళాశాలల పనివేళల్లో అందజేయాలని తెలిపారు. తర్వాత వచ్చిన దరఖాస్తులను స్వీకరించబడవని చెప్పారు.

పుస్తకాల కోసం..

- అధికారులతో ప్రత్యేక కమిటీలు
- ప్రతి విద్యార్థికీ చేరవేయడమే లక్ష్యం
- తాజాగా ప్రభుత్వ మార్గదర్శకాలు



నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాలలు తెరిచేనాటికి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయాలనే ఉద్దేశ్యంతో సమగ్రశిక్ష ద్వారా అధికారులతో జిల్లా స్థాయి, మండల స్థాయి, పాఠశాల స్థాయి కమిటీలను ఏర్పాటుచేశారు. 2025-26 విద్యాసంవత్సరానికి గాను ప్రభుత్వం నుంచి సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం ద్వారా 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, స్కూల్ బ్యాగు, 3 జతల యూనిఫాం క్లాత్, బెల్టు, ఒక జతషూస్, డిక్షనరీ, వర్క్‌బుక్స్ అందజేయనున్నారు. ఈ నేపథ్యంలో స్కూల్ తెరిచే సమయానికి ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా అందించేలాని ప్రభుత్వం సంకల్పించింది. దీంతో ఎక్కడా పర్యవేక్షణా లోపం ఉండకూడదనే భావనతో ఒక నెల ముందుగానే జిల్లాస్థాయి, మండలస్థాయి, పాఠశాల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తూ సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రేమంతకమార్ తాజాగా ఉత్తర్వులను జారీచేశారు.

మండలస్థాయి కమిటీ

1. మండల విద్యాధికారి-2 - టీమ్‌హెడ్
2. మండల విద్యాధికారి-1 - సభ్యులు
3. మండల ఇంజనీర్ - సభ్యులు
4. ఎంఐఎస్ లేదా డాటా ఎంట్రీ ఆపరేటర్ - సభ్యులు
5. ముగ్గురు కోఆర్డినేటింగ్ స్టాఫ్(సీఆర్పీలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు)

వీరందరూ పుస్తకాలను జిల్లాస్టాక్ పాయింట్లకు తీసుకోవాలి. ఆ తర్వాత స్టాక్ రిజిస్టర్‌ను మెయింటెనెన్స్ చేస్తూ ముందస్తు ప్రణాళిక ప్రకారం రూట్లను ఏర్పాటు చేసుకుని ట్రాన్స్‌పోర్ట్ ద్వారా స్కూళ్లకు పంపిణీ చేయాలి. ప్రతి స్కూలుకు ఏంఈవో తప్పనిసరిగా బయోమెట్రిక్ విధానం ద్వారా కిట్లను అందజేయాలి.

జిల్లాస్థాయి కమిటీ

1. ఏపీసీ(అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్) - టీమ్ హెడ్
2. సీఎంవో(కమ్యూనిటీమొబలైజనింగ్ ఆఫీసర్) - సభ్యులు
3. అసిస్టెంట్ సీఎంవో - సభ్యులు
4. ఎంఐఎస్ కోఆర్డినేటర్ - సభ్యులు
5. ఏపీవో (అడిషనల్ ప్రాజెక్టు ఆఫీసర్) - సభ్యులు

వీరంతా జిల్లాస్థాయి, మండలస్థాయి స్టాక్ పాయింట్లను గుర్తించి, కిట్‌లను మండలస్థాయి టీమ్‌లకు అందజేయాలి. అలాగే జిల్లా స్థాయి అన్ని మండలాల స్టాక్‌పాయింట్లను పర్యవేక్షిస్తూ ప్రతిరోజు ప్రభుత్వానికి నివేదిక పంపాలి. ఉన్నతాధికారుల ఆదేశాలను ఎప్పటికప్పుడు పాటిస్తూ వంద శాతం విజయవంతం చేయాలి.

పాఠశాల స్థాయి కమిటీ

1. పాఠశాల ప్రధానోపాధ్యాయులు
2. గ్రామ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లేదా పంచాయితీ కార్యదర్శి
3. మహిళా పోలీస్
4. ఇద్దరు పేరెంట్ కమిటీ సభ్యులు

వీరందరూ విద్యార్థులకు బయోమెట్రిక్ విధానం ద్వారా పుస్తకాలను పంపిణీ చేయాలి. రికార్డును మెయింటెనెన్స్ చేస్తూ ఎప్పటికప్పుడు అధికారులకు నివేదికను అందజేయాలి. ఏ సమస్య వచ్చినా వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలి.

కనీస మద్దతు ధర ప్రకటించాలి



మాట్లాడుతున్న ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య

- కేరళ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పి.ప్రసాద్
- కర్నూలులో జాతీయ రైతు సదస్సు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు కనీస మద్దతు ధర ప్రకటించాలని కేరళ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పి.ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని లక్ష్మీ నరసింహకల్యాణ మండపంలో ఏపీ రైతు సంఘం అధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం అధ్యక్షతన జాతీయ రైతు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా మంత్రితో పాటు ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నల్లచట్టాలను వెంటనే రద్దు చేయాలన్నారు. ఏపీలో సీపీఐకి తెలంగాణ రైతాంగ పోరాటం చేసిన చరిత్ర ఉందన్నారు. అధికారం లోకి రాకముందు డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేస్తామని చెప్పిన మోదీ మాట తప్పారని విమర్శించారు. ఫసల్ బీమా పథకం వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం భూసంస్కరణ చట్టం తీసుకువచ్చిందన్నారు. రైతులకు ఉపయోగపడే చట్టాలను తీసుకువచ్చే విషయంలో సీపీఐ ప్రధాన పాత్ర పోషించిందన్నారు. రైతుల సమస్యలపై చర్చించి జాతీయ మహసభలలో తీర్మానం చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామ న్నారు. ఈ సదస్సులో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్రయ్య, పంపన్నగౌడు, నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీ నరసింహయాదవ్, సీపీఐ జిల్లా సహయ కార్యదర్శి ఎస్.మునెప్ప, నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుగు నరసింహులు యాదవ్, రైతు సంఘం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీయే హయాంలో రైతుల ఆత్మహత్యలు

మోదీ అధికారంలోకి వచ్చాక దేశంలో సుమారు 3.49లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. రైతుల ఆదాయం పెంచుతామని చెప్పిన మోదీ కార్పొరేట్ శక్తుల ఆదాయం పెంచే పనిలో ఉన్నారు. మద్దతు ధర లేక రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రైతులకు వ్యతిరేకంగా పెట్టుబ డిదారులకు మోదీ అనుకూలంగా ఉన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూడా రైతులకు వ్యతిరేకంగా పనిచేస్తోంది. వెంటనే రైతులకు వ్యతిరేకంగా చేసిన నల్ల చట్టాలను రద్దు చేయాలి. కనీస మద్దతు ధర చట్టబద్దత కల్పించాలి. **- రావుల వెంకయ్య, ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి**

కమ్యూనిస్టుల పోరాటం అభినందనీయం



రైతు సమస్యల పరిష్కారంలో కమ్యూనిస్టులు, ఏపీ రైతు సంఘం చేస్తున్న పోరాటాలు అభినందనీయం. తాను స్వతహాగా రైతునని చెప్పుకోవడానికి గర్వపడుతున్నా. మంత్రిగా పని చేస్తున్న సమయంలో రైతుల కోసం ఆహర్నిశలు కృషి చేశాను. ఉపాధి హమీ చట్టం వ్యవసాయానికి అనుసంధానం చేయాలనే డిమాండ్ చాలా మంచిది. రైతుల సమస్యల పరిష్కారం కోసం చేసే పోరాటాల్లో తమ మద్దతు ఉంటుంది. రాయలసీమ ప్రాంతంలో పెండింగ్ ప్రాజెక్టులతో పాటు వేదవతి, గుండ్రేవుల, సిద్దేశ్వరం, అలుగు పూర్తి చేయాలి. మోదీ ప్రభుత్వం 11 సంవత్సరాల నుంచి రైతులకు రుణమాఫీ చేయలేదు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన హమీని అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలను రైతుల ఖాతాల్లో జమ చేయాలి.

- ఎన్.రఘువీరా రెడ్డి, మాజీ మంత్రి

దేశాన్ని కాపాడేది లౌకిక పార్టీలే



దేశాన్ని కాపాడేది లౌకిక పార్టీలే. బీజేపీ దేశంలో మతతత్వాన్ని రెచ్చగొట్టి మరోమారు అధికార చేజిక్కించుకోవాలని ప్రయత్నం చేస్తోంది. మోదీ ప్రభుత్వం వ్యవసాయం గురించి ఎప్పుడు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. రైతులను ఆదుకోవడంలో కేంద్రం విఫలమైంది. అంబాని, అదానికి ఊడిగం చేయడం తప్ప రైతులకు చేసిందేమి లేదు. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉంటే ప్రజలను పట్టించుకోకుండా మోదీ మాయలో ఉన్నారు. **- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ**

సెస్సు వసూలు లక్ష్యం రూ.67 కోట్లు

- మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు



కర్నూలు అగ్రికల్చర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ నుంచి ప్రారంభమయ్యే కొత్త ఆర్థిక సంవత్సరంలో కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి మార్కెటింగ్ శాఖకు రూ.67 కోట్ల సెస్సు లక్ష్యాన్ని రాబట్టాలని రెండు జిల్లాలోని 15 మార్కెట్ కమిటీల సెక్రటరీలు, ఏడీఎంలు నారాయణమూర్తి, రెహమాన్‌కు లక్ష్యాన్ని నిర్దేశించామని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం కర్నూలు ఏడీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు మార్కెట్ కమిటీ నుంచి రూ.8.70 కోట్లు, ఆదోని నుంచి రూ.18 కోట్లు, ఎమ్మిగనూరు నుంచి 8.50 కోట్లు, ఆలూరు నుంచి 1.10 కోట్లు, పత్తికొండ మార్కెట్ కమిటీ నుంచి రూ.95 లక్షలు, కోడుమూరు మార్కెట్ కమిటీ నుంచి రూ.1.80 కోట్లు, మంత్రాలయం మార్కెట్ కమిటీ నుంచి రూ.1.35 కోట్లు సెస్సు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు సెస్సును వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు జేడీ తెలిపారు. తెలిపారు. నంద్యాల జిల్లాలో నంద్యాల నుంచి రూ.6.30 కోట్లు, ఆళ్లగడ్డ నుంచి రూ.6 కోట్లు, డోన్ మార్కెట్ కమిటీ నుంచి రూ.1.45 కోట్లు, నందికొట్కూరు మార్కెట్ కమిటీ నుంచి రూ.3.65 కోట్లు, ఆత్మకూరు నుంచి రూ.5.30 కోట్లు, బనగానపల్లె మార్కెట్ కమిటీ నుంచి రూ.1.10 కోట్లు, కోవెలకుంట్ల నుంచి రూ.1.30 కోట్లు, పాణ్యం నుంచి రూ.1.56 కోట్లు సెస్సు రూపాల్లో వసూలు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించామని తెలిపారు. ఏ మాత్రం అశ్రద్ధ చూపినా సెక్రటరీలు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంట ఉత్ప త్తుల క్రయవిక్రయాలు జరిగే ఆదోని, కర్నూలు, ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ యార్డులో రైతులు తెచ్చే పంట ఉత్పత్తులకు భద్రత కల్పించడంతో పాటు ఎండ, వర్షానికి రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ప్లాట్‌ఫారాలను కవర్డ్ ప్లాట్‌ఫారాలను, గోదాములను ఏర్పాటు చేసేందుకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

రీ సర్వే పరిశీలన

కర్నూలు రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఈ.తాండ్రపాడు గ్రామంలో రీసర్వేను ఎస్ఎస్ఎల్ఆర్ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ గోవిందరావు, సీసీఎల్ఏ అడిషినల్ కమిషనర్ కె.శ్రీనివాసులు సంయుక్తంగా పరిశీలించారు. గ్రామంలో రీసర్వే ఏ విధంగా జరుగుతోందని సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. భూములను సర్వే చేసేటపుడు సంబంధించిన రైతులను పిలుస్తున్నారా? లేదా?, నోటీసులు ఏవిధంగా తయారు చేసి వారికి ఇస్తున్నారు? అని అడిగారు. ప్రధానంగా ఈ.తాండ్రపాడు తెలంగాణ రాష్ట్రం ఆనుకొని ఉన్న నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దులో రీసర్వే ప్రక్రియ ఎలా నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. బైరాపురం రోడ్డులో రాష్ట్ర ఉన్నతాధికారికి సర్వేపై కూలంకుశంగా సర్వేయర్లు వివరించారు. కల్లూరు మండలం పర్ల గ్రామంలో జరుగుతున్న రీసర్వేను కూడా పరిశీలించారు. కర్నూలు డీసీఎల్‌వో మునికన్నన్, రూరల్ తహసీల్దార్ వెంకటరమేష్‌బాబు డివిజనల్ సర్వేయర్లు, మండల సర్వేయర్లు, విలేజ్ సర్వేయర్లు, వీఆర్వోలు ఉన్నారు.



రీ సర్వేను పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

కండక్టర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు

గోనెగండ్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): కండక్టర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. వివరాలివీ.. ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోలో అలువాల గ్రామానికి చెందిన ఈడిగ వెంకటేశ్వర్లు కండక్టర్‌గా పని చేస్తున్నారు. గత నెల 30న ఎమ్మిగనూరు నుంచి పెద్దనేలటూరు బస్సు సర్వీసుకు వెంకటేశ్వర్లు విధులు నిర్వహించారు. ఆరోజు డైవందిన్నె స్టేజి దగ్గర బస్సు నిలకుండా మరి కొంత దూరంలో బస్సు నిలబడింది. స్టేజి దగ్గర ఎందుకు బస్సును నిలపలేదని పెద్దనేలటూరు గ్రామానికి చెందిన భూషణం కండెక్టర్‌తో గొడవ పడ్డాడు. బస్సులో వారు ఇద్దరికి సర్ది చెప్పారు. అప్పటికి గొడవ సర్దుమణిగింది. అయితే అదే రోజు రాత్రి పెద్దనేలటూరులో బస్సు నైట్ హాల్ట్‌లో ఉంది. భూషణం గత నెల 31న ఉదయం కండక్టర్ వెంకటేష్‌తో మళ్లీ గొడవ పడి చెప్పుతో దాడి చేశాడు. దీంతో కండక్టర్ ఈనెల 3న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువతిని బెదిరించిన యువకుడిపై..

ఆదోని, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీకి చెందిన గణేష్ అనే యువకుడుపై ఎస్సీ ఎస్టీ కేసుతో పాటు అత్యాచారయత్నం, ఐటీ యాక్ట్ నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ రామలింగమయ్య తెలిపారు. వివరాల మేరకు.. ఎస్‌కేడీ కాలనీలో నివాసముంటున్న గణేష్ పట్టణానికి చెందిన 22 ఏళ్ల అమ్మాయితో పరిచయం పెంచుకుని, ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు. అసభ్యకర ఫొటోను పంపి, తన ప్రేమను ఒప్పుకోకపోతే సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. దీంతో బాధితురాలు శుక్రవారం రాత్రి 3టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు గణేష్‌పై ఎస్సీ ఎస్టీ కేసుతో పాటు అత్యాచార యత్నం, ఐటీ యాక్టు నమోదు చేసినట్లు సీఐ రామలింగమయ్య తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఆదోని రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగనాథనహల్లి గ్రామానికి చెందిన హజ్జ మహదేవపై కేసు నమోదు చేసినట్లు ఇస్వీ ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. ఈనెల 1వ తేదీన అదే గ్రామానికి చెందిన ఉచ్చరంగ అనే వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా ద్విచక్ర వాహనంలో వచ్చిన హజ్జ మహదేవ ఢీకొటారు. తీవ్రంగా గాయపడ్డ ఉచ్చరంగను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హజ్జ మహదేవపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యర్రగుంట్లలో చైన్ స్నాచింగ్

శిరివెళ్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకొని వెళ్లాడు. గురువారం రాత్రి వర్షం పడుతున్న సమయంలో యర్రగుంట్ల మెయిన్ రోడ్డు వద్ద ఉన్న కిరాణా దుకాణంలో వస్తువులు కొనుగోలు చేసేందుకు వచ్చిన ఓ వ్యక్తి మహిళా యజమాని మెడలోని బంగారు గొలుసును తెంపుకొని పారిపోయాడు. ఆ సమయంలో వర్షం పడుతుండటంతో రహదారిపై జన సంచారం లేక పోవడంతో దుండగుడు బంగారు గొలుసుతో ఉడాయించాడు. ఎస్ఐ చిన్న పీరయ్య గ్రామానికి చేరుకొని సీసీ కెమెరా లను పర్యవేక్షించి విచారణ చేపట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ ఒప్పంద ఉద్యోగి మృతి

- ట్రాన్స్‌ఫారాన్ని సరిచేస్తుండగా విద్యుదాఘాతం



ఈరన్న (ఫైల్)

ఆదోని, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌ఫారాన్ని మరమ్మ తు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి చెందాడు. వివరా లమేరకు.. పట్టణంలోని రాజశ్రీహోటల్ వెనుక వైపు ట్రాన్స్‌ఫారంలో సమస్య ఏర్పడింది. దీంతో వారు విద్యుత్ అధికారులుకు ఫిర్యాచేయగా, అధికారులు కాంట్రాక్ట్ ఉద్యోగి కళ్ళపోతుల ఈరన్నను పంపారు. ఈరన్న ట్రాన్స్ ఫారాన్ని సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి లోనై మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తిపై దాడి

గోనెగండ్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగందిన్నె గ్రామంలో గొల్ల శ్రీనివాసులు అనే వ్యక్తి పై ఆదే గ్రామానికి చెందిన కరువ పెద్దయ్య అనే వ్యక్తి రాళ్లతో దాడి చేసినట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. వివరాలివీ.. గొల్ల శ్రీనివాసుల పొలం పైభాగంలో ఉండగా కురువ పెద్దయ్య పొలం కింది భాగంలో ఉంది. అయితే శ్రీనివాసుల పొలం పైభాగం నుంచి కిందభాగంలో ఉన్న కరువ పెద్దయ్య పొలంలోకి నీరు వచ్చినందుకు ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ విషయంపై మాట్లాడుకుందామని కురువ పెద్దయ్య గొల్ల శ్రీనివాసులును దూరంగా పిలుచుకోపోయి రాళ్లతో దాడి చేశాడు. శ్రీనివాసులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో కోడిపందెంరాయుళ్లు

- 8 మంది అరెస్ట్, పరారీలో 13 మంది
- కోళ్లు, నగదు, బైక్‌ల స్వాధీనం

నంద్యాల క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దకొట్టాల-బొల్లవరం గ్రామాల మధ్యలో జరుగుతున్న కోడిపందేల స్థావరంపై శుక్రవారం రాత్రి పోలీసులు దాడిచేశారు. కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ గంగయ్య సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్రమత్తమైన కోడి పందెంరాయుళ్లు బైక్‌లు, నగదు, కోళ్లను వదిలేసి పరారయ్యేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి పెద్దకొట్టాల, బొల్లవరం గ్రామాలకు చెందిన 8మందిని అదుపులోకి తీసుకోగా, మరో 13మంది పరారయ్యారు. సంఘటనా స్థలం నుంచి రెండు కోళ్లను, 10మోటార్ బైక్‌లను, రూ.10వేల నగదును స్వాధీనం చేసుకొని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రెండు కోడిపుంజులలో ఒక పుంజు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. పరారైన 13 మంది కోడిపందెం రాయుళ్ల కోసం రూరల్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పరారైన వారిలో కొందరు రాజకీయ పార్టీనాయకులు కూడా ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జంట హత్య కేసులో నిందితుడికి రిమాండ్



నిందితుడిని జైలుకు తీసుకెళ్తున్న పోలీసులు

గడివేముల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెసరవాయి గ్రామంలో 2021 సంవత్సరంలో జరిగిన జంట హత్య కేసులో నిందితుడికి జుడీషియల్ ఫస్ట్‌క్లాస్‌మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ సీసీ నాగార్జునరెడ్డి తెలిపారు. మండలంలోని పెసరవాయి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వడ్డు ప్రతాప్ రెడ్డి, వడ్డు నాగేశ్వర్‌రెడ్డిలను 2021లో హత్య చేసిన కేసులో నిందితు డైన బండపల్లి రామమద్దిలేటి కోర్టు వాయిదాలకు గైర్హాజరవు తుండడంతో జుడిషియల్ ఫస్ట్‌క్లాస్‌మెజిస్ట్రేట్ నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేశారన్నారు. నిందితుడిని కోర్టులో శుక్రవారం హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా: ఇద్దరికి తీవ్ర గాయాలు

నందవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోహరాపురం దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో స్నేహ అనే విద్యార్థిని, ఆటో డ్రైవర్ వీరాచారికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలివీ.. గంగవరం గ్రామానికి చెందిన విద్యార్థిని నాగలదిన్నె నుంచి గంగవరంకు వెళ్లేందుకు ఆటో ఎక్కింది. అయితే జోహరాపురం గ్రామం దగ్గర ఆటో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న స్నేహ కాలికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆటోడ్రైవర్ వీరాచారి తలకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్య సేవల కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

దొంగల అరెస్టు



దొంగల అరెస్టును చూపుతున్న పోలీసులు

మహానంది, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపల్లి ఆర్ఎస్ సమీపంలో రైల్వే ఇనుప సామగ్రిని చోరి చేసిన ఐదుగురు దొంగలను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గతనెల 31వ తేదిన గుర్తు తెలియని వ్యక్తులు గాజులపల్లి సమీపంలో రైల్వే డబుల్ లైన్ నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసుకొన్న ఇనుప సామగ్రిని దొంలించారని సైట్ ఇంజనీర్ సుమంత్ కుమార్ ఫిర్యాదు చేశారు. గోపవరానికి చెందిన పిన్నాపురం తిరుమలేసు, నాగసరపు అశోక్, మాచర్ల ఆదికేశవ్, షేక్ సద్దాం హుస్సేన్, ఔకు శివను సీతారామపురం సమీపంలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చెప్పారు. నిందితుల నుంచి ఒకటిన్నర టన్ను ఇనుప సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నంద్యాల కోర్టులో హాజరుపర్చినట్లు చెప్పారు. మరో నిందితుడు గోపవరానికి చెందిన చెవుల విక్రమ్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

శ్రీశైలం ఘాట్‌లో కారు దగ్ధం



అగ్నికి ఆహుతి అవుతున్న వాహనం

సున్నిపెంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఘాట్ రూట్‌లో శుక్రవారం మధ్యహ్నం ఓ కారు అగ్నికి ఆహుతి అయ్యింది. వివరాలివీ.. గుంటూరుకు చెందిన కొందరు భక్తులు శ్రీశైల దర్శనార్థం వస్తున్నారు. దోర్నాల-శ్రీశైలం ఘాట్ రూట్ మధ్య చిన్నారుట్ల గిరిజన గ్రామం వద్దకు రాగానే కారు ఇంజన్‌లో పొగలు రావడాన్ని భక్తులు గమనించారు. ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టిన భక్తులు ప్రాణ భయంతో అప్రమత్తమై కారు నుంచి బయట పడ్డారు. కారు ఇంజన్‌లోని బ్యాటరీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి అందరూ చూస్తుండగానే వాహనం పూర్తిగా కాలిపోయింది.

తండ్రీకొడుకులపై హత్యాయత్నం

బేతంచెర్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన కురువ మద్దయ్య తండ్రి సుబ్బరాయుడును ఒక వ్యక్తి కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడని ఎస్ఐ రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. రంగాపురం గ్రామానికి చెందిన కురువ మద్దయ్య, తండ్రి సుబ్బరాయుడును వారి ఇంటి వద్దకు వెళ్లి అదే గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి పాతకక్షలు మనసులో పెట్టుకుని కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. మద్దయ్య ఫిర్యాదు మేరకు ప్రసాద్‌రెడ్డిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

కోసిగి ప్రభుత్వాసుపత్రిలో బాలింత మృతి

- కాన్పు అయిన పది నిమిషాలకే విషాదం



నాగేంద్రమ్మ (ఫైల్)

కోసిగి, ఏప్రిల్ 4 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింత బి.నాగేంద్రమ్మ మగ శిశువుకు జన్మనిచ్చిన కొడుకును చూడకుండా మృతి చెందిన ఘటన కోసిగి ప్రభుత్వ ఆసుపత్రిలో చోటు చేసుకుంది. కోసిగి మండలంలోని డి.బెళగల్ పంచాయతీలోని దొడ్డి గ్రామానికి చెందిన నరసన్న, నరసింగమ్మ దంపతుల చిన్న కుమార్తె నాగేంద్రమ్మను ఆదోని మండలం సంతెకుల్లూరు గ్రామానికి చెందిన హెబ్బటం రమేష్‌కు ఏడాది క్రితం నాగేంద్రమ్మను ఇచ్చి వివాహం చేశారు. అయితే నాగేంద్రమ్మ శుక్రవారం కాన్పు కోసం కోసిగి ఆసుపత్రికి తీసుకురాగా, కాన్పు చేసిన స్టాఫ్ నర్సు విద్యావతి కాన్పు మధ్యలోనే బాలింత నాగేంద్రమ్మకు ఫిట్స్ రావడంతో కడుపులో ఉన్న మగశిశువును సురక్షితంగా బయటకు తీసిన కొద్ది క్షణాల్లోపే బాలింత నాగేంద్ర మ్మ మృతి చెందినట్లు స్టాఫ్ నర్సు విద్యావతి తెలిపారు. మొదటి కాన్పులోనే తమ కూతురు పండంటి మగబిడ్డకు జన్మనిచ్చి కొడుకును చూడకుండానే తిరిగి రాని లోకాలకు వెళ్లిందని మృతురాలి తల్లిదండ్రులు నరసన్న, నరసింగమ్మ రోదించారు.

ఆమె భర్త స్వగ్రామమైన ఆదోని మండలం సంతకుల్లూరు తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. శిశువును మెరుగైన వైద్య చికిత్స కోసం ఆదోని ప్రైవేటు ఆసుపత్రిలో ఐసీయులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌కుమార్‌ను వివరణ కోరగా ఫిట్స్‌తో బాలింత మృతి చెందిందని చెప్పారు.



ముస్లీం వివాహ సంబంధాలు

బిజినెస్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ టీచర్స్, బ్యాంక్, పోస్టల్, రైల్వే, పోలీస్, డిఫెన్స్, డాక్టర్ సంబంధాలు కలవు. స్టార్ మ్యారేజ్ బ్యూరో, నంద్యాల జిల్లా. సెల్ : **87908 44959.** (2వ సంబంధాలు కలవు.) AJL-236236

CHANGE OF NAME

I, **GAJULA ASMIN** (Old Name) R/o. H.No: 21/53, Sangaiah Peta, Nandikotkur, Nandyal dist, AP., I have changed my name to **SHAIK GAJULA ASMIN** (New Name) D/o.SHAIK GAJULA KHADAR BASHA AJL-202947

CHANGE OF NAME

I, **GAJULA RESHMA** (Old Name) R/o.H.No:21/53, Sangaiah Peta, Nandikotkur, Nandyal dist, AP., I have changed my name to **SHAIK GAJULA RESHMA** (New Name) W/o.SHAIK GAJULA KHADAR BASHA AJL-202947

WANTED

★ శివకార్తికేయ హోంకేర్ నందు వృద్ధులకు / పేషంట్సు / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని / వంట పనిచేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph.: 99120 11499, 99120 11899. AJH-003137

CHANGE OF NAME

I, **YADAGIRI RAJAMMA** (OLD NAME), W/O. PANYAM ADISHESHUDU, R/O HNO:2-133, Bethamcherla, Nandyal Dist, AP, have changed my name as **PANYAM RAJESWARI** (NEW NAME) W/O. PANYAM ADISHESHUDU AJL-236408

CHANGE OF NAME

I, SK.R.HAMIDA BEGUM, D/O. Late. SK.R. NANNE SAHEB, My gaurdian son name **PONNOLI VEERA BRAHMENDRA VARMA** (old name) presently residing at H NO: 87-1095-61, Ganesh Nagar near Shiva alayam Kurnool 518002 Dist,A.P, have changed my guardian son name **PONNOLI VEERA BRAHMENDRA SURAJ VARMA** (new name) S/O.PONNOLI NAGAIAH (LATE). AJL-236408

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్ లో తాకట్టులో వున్నవి మాదబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: **7382114647.** AJA-227111

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

బహిరంగ ప్రకటన

ICICI Bank
ICICI బ్యాంక్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం : ల్యాండ్ మార్క్, రేస్ కోర్సు సర్కిల్, వడోదర - 390 007.
కార్పొరేట్ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా - కుర్లా కాంప్లెక్స్, ముంబాయి 400 051.

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

ICICI బ్యాంక్ లిమిటెడ్ ("ICICI బ్యాంక్") నుండి వారిచే వినియోగించబడిన బంగారు ఆభరణాలపై రుణవసతి ("వసతి")గా పొందిన వారి బకాయి మొత్తములను తిరిగి చెల్లించవలసినదిగా దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలకు నోటీసులు జారీ చేయబడినవి. తమ బకాయిలను తిరిగి చెల్లించుటలో రుణగ్రహీతలు విఫలమైనందున, తప్పనిసరి పరిస్థితిలో **ఏప్రిల్ 16 2025**న, తనఖా చేయబడిన బంగారు ఆభరణములకు మేము ఇ-వేలము నిర్వహించుచున్నాము. ముందస్తు సమాచారం లేకుండా ఖాతాను తొలగించు / వేలము తేదీని మార్చు హక్కును ICICI బ్యాంక్ కలిగియున్నది. ఇ-వేలము ఆన్‌లైన్ ద్వారా **మ.12.30 గం. నుండి మ.3.30 గం.ల మధ్య https://gold.samil.in**లో నిర్వహించబడును. సవివర నియమ నిబంధనల కొరకు దిగువ ఇవ్వబడిన వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వండి. రుణగ్రహీత మరణించినచో న్యాయవారసులకు అన్ని నిబంధనలు వర్తిస్తాయి.

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: కర్నూలు	
027962019487	ఎ చంద్ర శేఖర్
శాఖ పేరు: హిందూపురం	
067262006589	అఖ్తర్ అస్మా
శాఖ పేరు: నంద్యాల	
068862004972	పల్లప్ప మనోహర్
శాఖ పేరు: కనిగిరి	
069862017816	మోతుకూరి కృష్ణ
శాఖ పేరు: విశాఖపట్నం- హెచ్‌పిసిఎల్	
126962002875	దినేష్ కుమార్ గుర్జార్
శాఖ పేరు: పోరంకి	
236862001951	తిరుపతి కిషోర్
శాఖ పేరు: విశాఖపట్నం-అక్కయ్యపాలెం	
241162001214	రాజేశ్వరరావు బల్లా
శాఖ పేరు: నెల్లూరు-వేదాయపాలెం	
250362002613	చలమల వినోద్ కుమార్ రెడ్డి
250362002707	చలమల వినోద్ కుమార్ రెడ్డి
250362002709	చలమల వినోద్ కుమార్ రెడ్డి
250362002810	చలమల వినోద్ కుమార్ రెడ్డి
శాఖ పేరు: తెనాలి	
253162006827	నంబూరు వివిఎంబి నాగ ఫణీంద్ర

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: సత్తెనపల్లి	
285362000584	నెల్లూరి ఆలీష్య
శాఖ పేరు: పామూరు	
307262002722	ఇంజమూరి శ్రీను
శాఖ పేరు: జంగమేశ్వరపురం	
307362001310	మందలపు నరసింహారావు
307362001376	మందలపు నరసింహారావు
307362001967	మందలపు నరసింహారావు
శాఖ పేరు: పలమనేరు-ఆంధ్రప్రదేశ్	
363162002408	కె సురేష్
363162002423	కె సురేష్
శాఖ పేరు: పీలేరు	
375562002355	ఎం శైలజా
శాఖ పేరు: పుయ్యూరు-ఆంధ్రప్రదేశ్	
375962002424	బందుపల్లి లిఖిత చంద్రిక
శాఖ పేరు: గుంటూరు	
630762031656	బ్రహ్మయ్య కర్నాటి
శాఖ పేరు: నెల్లూరు	
631062022423	షేక్ యాస్మిన్ బాబు
631062022535	షేక్ యాస్మిన్ బాబు
631062022604	షేక్ యాస్మిన్ బాబు
శాఖ పేరు: ఏలూరు	
631362011494	పూసల సాయిప్రసన్న
శాఖ పేరు: కర్నూలు- సి క్యాంపు	

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
756762001649	షేక్ అబ్దుర్ రెహమాన్
756762002166	షేక్ అబ్దుర్ రెహమాన్
శాఖ పేరు: విశాఖపట్నం- సీతా నగర్	
789462000204	రేఖ తులసీరావు
శాఖ పేరు: బెంగళూరు-సర్జాపూర్ వెల్త్	
194962000685	నాగిరెడ్డి రాజశేఖర రెడ్డి
శాఖ పేరు: హైదరాబాద్- శివం రోడ్	
236262001720	గరిగిపాటి ఫణి ప్రసన్న
శాఖ పేరు: హైదరాబాద్ బంజారాహిల్స్ 14	
236562002510	బోడిరెడ్డి నాగిరెడ్డి
శాఖ పేరు: కోదాడ, తెలంగాణ	
363362004881	మునగపాటి నరసింహారావు
శాఖ పేరు: హైదరాబాద్-విద్య నగర్	
568462000074	గరిగిపాటి ఫణి ప్రసన్న
శాఖ పేరు: హైదరాబాద్- కూకట్‌పల్లి	
631262037019	అలవాల దినేష్ రెడ్డి
శాఖ పేరు: హైదరాబాద్- ఐడిఏ బొల్లారం రోడ్	
720462000870	బబ్లిడ మధుబాబు

తేది: 05.04.2025
ప్రదేశం: చిత్తూరు, గుంటూరు, అన్నమయ్య, కాకినాడ, ఏలూరు, కృష్ణా, కర్నూలు, నంద్యాల, పల్నాడు, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీ సత్యసాయి, విశాఖపట్నం, అనంతపురం, తూర్పు గోదావరి, కోదాడ, శ్రీకాకుళం

సం/- అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

రేపు క్యాన్సర్ నివారణపై అవగాహన సదస్సు

జూపాడుబంగ్లా, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తరిగోపుల గ్రామంలో ఆదివారం క్యాన్సర్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెంకటేశ్వర్లుయాదవ్, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి తెలిపారు. ప్రముఖ క్యాన్సర్ వైద్యులు రవీంద్రబాబు సొంతూరు తరిగోపులలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఎండలో కూర్చుని భోజనాలు చేస్తూ ఇబ్బంది పడుతున్నారని భావించి రూ. 10లక్షలతో భోజనశాలలు నిర్మించారు. క్యాన్సర్ అవగాహ నసదస్సులో పాల్గొని హెచ్‌పీవీ టీకా వేయడంతో పాటు, భోజనశాలను పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ ప్రారంభిస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్య, నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నాయకులు మాండ్రశివానందరెడ్డి, గౌరెవెంకటరెడ్డిలతో పాటు, డీఈవో జనార్దన్‌రెడ్డి పాల్గొంటారని వారు తెలిపారు.

రోడ్డుకు అడ్డంగా లారీ.. ప్రయాణికుల అవస్థలు



రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయిన లారీ

బండి ఆత్మకూరు, ఏప్రిల్4(ఆంధ్ర జ్యోతి): నంద్యాల, ఆత్మకూరు ప్రధాన రహదారిలోని పార్నపల్లె గ్రామంలో శుక్రవారం వరి ధాన్యం లోడ్‌తో ఉన్న లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. శ్రీశైలం, మహానంది క్షేత్రాలకు చేరుకునే భక్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు మూడు నాలుగు గంటల పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన వద్దకు చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

గిరిజన కాలనీల పరిశీలన

మహానంది, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బీపురం, పుట్టుపల్లి,తిమ్మాపురం గ్రామాల్లోని గిరిజన కాలనీల్లో ఆర్‌బీఎస్‌కె నోడల్ ఆఫీసర్ డాక్టర్ కాంతారావు నాయక్ శుక్రవారం పరిశీలించారు. ఆయన ఆయా కాలనీల్లో గిరిజనులు ఆరోగ్య సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. గిరిజనులు రోగాల బారిన పడినప్పుడు వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్య చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఎం.తిమ్మాపురంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి భగవాన్‌దాస్,ఎంపీహెచ్ఈవో ఉసేన్‌రెడ్డి, సిబ్బంది భార్గవి, అరుణ, శ్రీలత పాల్గొన్నారు.

బాధితులకు సాయం

మహానంది, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆంజనేయపురం గ్రామంలో మౌళాలి అనే వ్యక్తికి చెందిన గుడిసె ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో గుడిసెలో ఉన్న వస్తువులు, తిండిగింజలు కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న అంగన్‌వాడీ వర్కర్ నయోమి బాధితులకు కట్టు బట్టలు, ఆర్థిక సాయం అందజేశారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలి

నందికొట్కూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం నందికొట్కూరు విద్యుత్‌శాఖ ఏడీఏ శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని, విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని ప్రజలకు వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 32 వేల కోట్లు విద్యుత్ చార్జీలు పెంచితే నేడు కూటమి ప్రభుత్వం 10 నెలల కాలంలో వేల కోట్ల రూపాయలను ప్రజలపైన భారం మోపుతుందన్నారు. విద్యుత్ చార్జీలను తగ్గించకపోతే గత ప్రభుత్వానికి పట్టి గతే కూటమి ప్రభత్వానికి పడుతుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకులు నరసింహులు, మాబాషా, మహిళా నాయకులు బి.లక్ష్మీదేవి, ముత్తుజాబి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అధికారుల బదిలీ

కొత్తపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలో గత కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధి అధికారులు, సిబ్బంది బదిలీపై వెళ్లారు. కొత్తపల్లి మండల ఉపాధి అధికారిగా విధులు నిర్వహిస్తున్న హరికృష్ణ ఉయ్యాలవాడకు బదిలీ కాగా, ఈసీ శ్రీనివాసులు గోస్పాడు మండలానికి బదిలీపై వెళ్లారు. అలాగే టీఏలు కిషోర్ కుమార్, ఓబులమ్మలు జూపాడుబంగ్లాకు, బీఎఫ్‌టీ లింగస్వామి ఎన్ఆర్ఈజీఎస్ నుంచి ఐటీడీఏ కొత్తపల్లికి బదిలీ కాగా, సీవో నాగేశ్వరరావు నందికొట్కూరుకు బదిలీ అయ్యారు.

వక్ఫ్ బిల్లు ఆమోదంపై హర్షం

ఆత్మకూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్, రాజ్యసభల్లో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం కావడం పట్ల శ్రీశైలం నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ మోమిన్ షబాన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆత్మకూరు పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయం వద్ద ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి ముస్లింలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదంతో అట్టడుగు ముస్లిం వర్గానికి కూడా సామాజిక న్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఉన్నారు.

సైన్స్ ప్రాజెక్టు పోటీలో శాంతినికేతన్ విద్యార్థి ప్రతిభ

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కల్పనాచావ్లా క్రియేటివ్ మైండ్స్ సైన్స్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీల్లో నంద్యాల శ్రీ శాంతినికేతన్ పాఠశాల 6వ తరగతికి చెందిన పూర్ణచంద్ర రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. పాఠశాల ఛైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ భారత సైన్యంలో వినియోగంలో ఉన్న వివిధ రకాల యుద్ధవిమానాలు, హెలికాప్టర్‌లు అనే అంశంపై పూర్ణచంద్ర ప్రాజెక్టును విశ్లేషించి రాష్ట్రంలోనే 2వస్థానాన్ని సాధించినట్లు వివరించారు ఈ సందర్భంగా విద్యార్థినిని సత్కరించి మెమోంటో అందజేశారు.

నిలిచిపోయిన విద్యార్థి బస్సు

కొత్తపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నుంచి కొత్తపల్లి మీదుగా విద్యార్థి బస్సు ఇంజన్‌లో సమస్య రావడంతో మార్గమధ్యంలో నిలిచిపోయింది. శుక్రవారం ఆత్మకూరు నుంచి కొత్తపల్లి మీదుగా వెళ్తున్న ఏపీ07జడ్0409 నెంబరు గల విద్యార్థి బస్సు విద్యార్థులను జడ్‌వారిపల్లె గ్రామానికి తీసుకెళ్లేది. అయితే మండలంలోని ఎదురుపాడు గ్రామంలోని బస్టాండు సెంటరుకు చేరేసరికి ఇంజన్‌లో సమస్య రావడంతో మార్గమధ్యంలో నిలిచిపోయింది. బస్సులో 20 మంది విద్యార్థులు ఉన్నారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవు



నిలిచిపోయిన బస్సు

పాములపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ సురేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పాములపాడు బస్టాండు ఆవరణలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఇందులో ఐదుమంది మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వాహనాలను స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో పోలీసులు యాగంటి, టవేశ్వర్ పాల్గొన్నారు.

వర్షం..నష్టం

నంద్యాల జిల్లాలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరి, మిరప, మొక్కజొన్న పంటలు నేలవాయి. చేతికొచ్చే సమయంలో అకాల వర్షం ఆపార నష్టం మిగిల్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు పరిహారం అందజేయాలని రైతులు, నాయకులు కోరుతున్నారు.

దెబ్బతిన్న పంటలు ● తీవ్రంగా నష్టపోయిన రైతులు



నేలవాలిన వరి పంటను చూపుతున్న రైతు



గడివేముల మండలంలో నేలవాలిన వరి



మద్దూరు గ్రామంలో వర్షానికి దెబ్బతిన్న పసుపుపంట



ఈర్నపాడులో వరి పంటను పరిశీలిస్తున్న రామలింగారెడ్డి

నంద్యాల రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండలం కొత్తపల్లి గ్రామంలో వరి పంటకు భారీనష్టం ఏర్పడింది. గురువారం సాయంకాలం నుండి శుక్రవారం అర్ధరాత్రి వరకు కురిషిన గాలి వానకు సుమారు 42 హెక్టార్లకు పైగా వరి పంట నేలకు వాలింది, మండలంలో ఎక్కడ నష్టం జరగలేదని, కొత్తపల్లి గ్రామంలో 42 హె క్టార్లలో వరిపంటకు నష్టం వాటిల్లినట్లు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్లు ఏవో ప్రసాదరావు తెలిపారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

బండిఆత్మకూరు: నష్ట పోయిన పంటల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కెసీ కెనాల్ ప్రాజెక్టు ఛైర్మన్, శ్రీశైలం టీడీపీ సమన్వయ కర్త బన్నూరు రామలింగారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఈర్నపాడు గ్రామంలో దెబ్బతిన్న వరి, అరటి పంటను ఆయన పరిశీలించారు. అలాగే వెంగళరెడ్డిపేట గ్రామంలో దెబ్బతిన్న వరి పంటను సీపీఎం నాయకులు రత్నమయ్య, డేవిడ్, రాజు, రామచంద్రుడు, సుబ్బరాయుడు పరిశీలించారు. వెంట ఏవో స్వాతి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేలవాలిన మొక్కజొన్న

మిడుతూరు: మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షం వల్ల మొక్కజొన్న పంట నేలకు ఒరిగాయి. మండలంలోని నాగలూటి, పీరు సాహేబ్ పేట తదితర గ్రామాలలో రబీలో సాగు చేసిన మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి మెరుపులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఎండుమిరప, మొక్కజొన్న రైతులు తీవ్ర నష్టపోయారు.

వెలుగోడు: మండలంలో గురువారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షాల వల్ల పంటపొలాలు నీటమునిగాయి. మండలంలో కురిసిన వర్షపాతం 56.8 మిల్లీమీటర్లుగా నమోదైంది. వరి, మొక్కజొన్న పంట పొలాలు సుమారు 125 ఎకరాలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. దెబ్బతిన్న పంటపొలాలనె ఏవో పవన్‌కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది రామలక్ష్మి, అఫ్సర్, రైతులు పాల్గొన్నారు.

గడివేముల: మండలంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. వరి, కొర్ర, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. కలాల్లో ఆరబోసిన ధాన్యం దెబ్బతినింది.

పాములపాడు: మండలంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షాలకు మండలంలో పంటలు దెబ్బతిన్నాయి. 20.6 మిమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు అదికారులు తెలిపారు. మండలంలోని మద్దూరు, వేంపెంట, ఎర్రగూడూరు తదితర గ్రామాలలో కొంతమేర వరాపంటలు దెబ్బతిన్నాయి.



పారుమంచాలలో తడిసిపోయిన మిరపను ఆరబెడుతున్న రైతులు



నాగలూటిలో నేలవాలిన మొక్కజొన్న పంట



నంద్యాలరూరల్: కొత్తపల్లిలో నేలవాలిన వరి పంట

సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు



రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

నంద్యాల హస్పిటల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని లేనిచో కఠిన చర్యలు తీసుకుంటామని నంద్యాల జిల్లా మెడికల్ ఆఫీసర్ డా.వెంకటరమణ హెచ్చరించారు. శుక్రవారం మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓపీ విభాగాన్ని అక్కడున్న రోగులకు అందించే సేవలు, చికిత్స, మందులు ఎలా ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యక్రమాల ఐఈసీ మెటీరియల్ ప్రదర్శనను అవగాహన కోసం ప్రజలకు, రోగులకు అందుబాటులో ఉండే విధంగా ప్రదర్శించాలన్నారు. కాన్పు కోసం వచ్చే ప్రతి గర్భిణికి వీలైనంతవరకు సాధారణ కాన్పు అయ్యేలా వైద్యాధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. బాలింతలు, పుట్టిన శిశువులకు అవసరమైన సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మందుల గదిని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పాఠశాలలో ఉన్న విద్యార్థులకు రెగ్యులర్‌గా స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించాలని, అలాగే ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు.

సర్వేను వేగవంతంగా చేపట్టండి : జాయింట్ కలెక్టర్



భూములను పరిశీలిస్తున్న జేసీ

సున్నిపెంట, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సున్నిపెంట గ్రామంలో చేపడుతున్న సర్వేను వేగవంతంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ అన్నారు. శుక్రవారం సున్నిపెంటకు వచ్చిన జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ జెన్‌కో అతిథి గృహంలో ఇరిగే షన్, పంచాయతీ రాజ్, రెవెన్యూ , అటవీశాఖ, లాండ్ సర్వే అసిస్టెంట్ డైరక్టర్ జయరాజు, జిల్లా టూరిజంశాఖ అధికారి సత్యనారాయణ, శ్రీశైల దేవస్థానం అధికారులతో సమావేశం నిర్వహించారు. తరువాత సున్నిపెంటలో శ్రీశైల దేవస్థానానికి కేటాయించిన భూములు, పంచాయతీ రాజ్ శాఖ నుంచి ప్రభు త్వం స్వాధీనం చేసుకున్న భూములు, స్థానికులు నివాసం ఉంటున్న స్థలాలను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఇందులో ప్రధానంగా టూరిజం శాఖ కోరిన 50 ఎకరాల స్థల సేకరణ విషయమై ఈ సర్వే నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. జాయింట్ కలెక్టర్‌తో పాటు అటవీశాఖ సబ్‌డిఎఫ్‌ఓ అబ్దుల్ రవూఫ్ ఈ సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. గత కొన్ని రోజులుగా జరుగుతున్న సర్వే భూముల వివరాల నివేదికను జిల్లా కలెక్టర్ సమర్పిస్తున్నట్లు దేవస్థానం ఈఈ నరసింహారెడ్డి తెలిపారు.

బ్యాంకు ఉద్యోగాలకు 246 మంది విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కోచింగ్ సెంటర్ నిర్వాహకులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల శ్రీ గురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన 246 మంది విద్యార్థులు ఐబీపీఎస్, క్లరికల్ ఉద్యోగాలకు 246 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కోచింగ్ సెంటర్ ఛైర్మన్ డాక్టర్ దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ ఐబీపీఎస్ వారు 2024-25 వార్షిక సంవత్సరానికి గాను జనవరిలో నిర్వహించిన పరీక్షల్లో తమ విద్యార్థులు 193 మంది క్లరికల్, 36 మంది ఆఫీసర్స్, 17 మంది ఎస్‌వోలుగా ఉద్యోగాలు సాధించినట్లు వివరించారు. అనంతరం కేకును కట్ చేసి వేడుకలను నిర్వహించారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి: ఏపీవో

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామి పథకం ద్వారా గ్రామాల్లో జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికి పని కల్పించేలా పనులు గుర్తించి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆత్మకూరు ఏపీవో మనోహర్ పేర్కొన్నారు. శుక్రవారం మహానంది నుండి ఆత్మకూరుకు బదిలీ అయిన ఏపీవో మనోహర్ ఆత్మకూరులో బాధ్యతలు చేపట్టిన అనంతరం టీఏ, ఎఫ్ఏలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు సూచనలు చేశారు. వలసలను నివారించేందుకు జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికి వంద రోజుల పని దినాలు కల్పించేలా నివేదికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఈసీ వరదరాజులు మండలంలోని అన్ని గ్రామాల టీఏలు, ఎఫ్ఏలు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఊయల సేవ

శ్రీశైలం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకళ్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయలసేవను ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా మహాగణపతి పూజను చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు.

● శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం లోకకళ్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. ఈ పూజలలో భాగంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేష అలంకరణ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

ట్రాఫిక్ సిబ్బందికి సమ్మర్ కిట్లు



ట్రాఫిక్ సిబ్బందికి సమ్మర్ కిట్లను అందజేసిన ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని ట్రాఫిక్ సిబ్బందికి సమ్మర్‌కిట్లను దాత సహకారంతో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అందజేశారు. శుక్రవారం పట్టణంలోని కాత్యాయిని మెడికల్స్, సెవెన్‌హిల్స్ హాస్పిటల్ ఛైర్మన్ మారుతికుమారు సౌజన్యంతో ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి నాణ్యమైన వాటర్‌బాటిళ్లు, చలువకళ్లజోడు, టోపీ, సన్‌స్క్రీన్ క్రీమ్, ఎలక్ట్రోల్స్ ప్యాకెట్స్‌తో ఉన్న సమ్మర్‌కిట్‌ను ఎస్పీ సిబ్బందికి పంపిణీ చేశారు. మండుటెండల్లో విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులపై ఔదార్యం చూపించి కిట్లను పంపిణీ చేసిన దాత మారుతికుమారును ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్ సుధామోహన్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ బి.మల్లికార్జునగుప్త, ఎస్ఐ లక్ష్మన్న, సిబ్బంది పాల్గొన్నారు.

అమలులో 30 పోలీస్ యాక్ట్



మాట్లాడుతున్న ఏఎస్పీ మందా జావళి

నంద్యాల క్రైం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో పోలీస్ 30-యాక్ట్ అమలులో ఉంటుందని ఏఎస్పీ మందా జావళి అల్ఫోన్స్ శుక్రవారం తెలిపారు. పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఉత్సవాలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించుకునేవారు తప్పనిసరిగా పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలని సూచించారు. షరతులను ఉల్లంఘించినవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

నందికొట్కూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరులోని నాటుసారా స్థావరాలపై శుక్రవారం ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయగా, షికారి నాగమణి(62) వద్ద 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ జఫ్రుల్లా తెలిపారు.

సూపర్ సిక్స్ పథకాలు ఎక్కడ?

నందికొట్కూరు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాకర్తల రమేష్ కుమార్ మాట్లాడుతూ పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు, నాయకులు గోపాలకృష్ణ, రాజు, వెంకటేశ్వర్లు, ఉస్మాన్ భాష, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

పాములపాడు, ఏప్రియల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రవరం గ్రామంలోని సచివాలయంలో ఉపాధిహామి ఫీల్డ్ అసిస్టెంట్ అనితపై వచ్చిన ఆరోపణలపై ఉపాధిహామీ ఆత్మకూరు క్లస్టర్ ఏపీడీ అన్వరాబేగం బహిరంగ విచారణ చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతికి పాల్పడింది అంటూ గ్రామంలోని కొంతమంది, ఇటీవల నిర్వహించిన సామాజిక తనిఖీలో అధికారులకు పిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎపివో విమలమ్మ, సర్పంచ్‌ల ఆధ్వర్యంలో బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ విచారణలో ఉపాధి సిబ్బంది, కూలీల నుండి వివరాలు సేకరించారు. సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు తెలియచేయనున్నట్లు తెలిపారు.

బీజేపీ శ్రీశైలం మండల కమిటీ ఎన్నిక



నియామక పత్రాలను అందజేస్తున్న చదువుల శ్రీను

సున్నిపెంట/ శ్రీశైలం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ శ్రీశైలం మండల కమిటీని ఏర్పాటు చేసినట్లు శ్రీశైలం మండలం అధ్యక్షుడు చదువుల శ్రీను తెలిపారు. సున్నిపెంటలోని రెడ్ల కల్యాణ మండపంలో కమిటీని ప్రకటించారు. శ్రీను మాట్లాడుతూ మండల కమిటీ పదాధికారులు 14 మంది, కార్యవర్గ సభ్యులుగా ఏడుగురిని ఎన్నుకున్నామని తెలిపారు. మండలంలో బీజేపీని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు చిక్కుడుచెట్టు వెంకటేశ్వర్లు, గెల్లి వెంకటేశ్వర్లు, నల్లబోతుల మల్లికార్జున, సోమిశెట్టి మల్లికార్జున, గోదా ఆనంద్, పరమేశ్వరప్ప, జెడ్డా వెంకటేశ్వర్లు,రామకృష్ణ, ఏసుదాసు, గణేష్, మల్లికార్జున పాల్గొన్నారు.


సనాతన ధర్మం కోసమే యాత్ర



మహానంది ఆలయంలో నారాయణం వెంకటరెడ్డి

మహానంది, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): హిందు సనాతన ధర్మం ప్రచారం కోసమే తాను దక్షిణ భారత దేశ యాత్రను స్కూటర్ మీద చేస్తున్నట్లు విజయనగరంకు చెందిన నారాయణం వెంకటరెడ్డి తెలిపారు. స్కూటర్ యాత్రలో భాగంగా శుక్రవారం రాత్రి ఆయన మహానంది క్షేత్రానికి వచ్చారు. ఆలయం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి, ప్రధాన అర్చకులు అర్జునశర్మ స్వాగతం పలికారు. హిందూ ధర్మం గురించి ప్రచారం చేసేందుకు గత ఏడాది అక్టోబర్ 13న హైదరాబాద్ మనికొండ గోల్డెన్ టెంపుల్ నుంచి స్కూటర్ యాత్రను ప్రారంభించానని చెప్పారు. ఇప్పటి వరకు 28 రాష్ట్రాలు, లక్ష కిలోమీటర్ల దూరం ప్రయణించానని, మిగిలిన యాత్రను 800 రోజుల్లో పూర్తి చేస్తానని చెప్పారు.

రవీంద్రనాథ్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అవార్డు



రవీంద్రనాథ్

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నంద్యాల బాలాఅకాడమీ, రవీంద్ర పాఠశాల డైరెక్టర్ రవీంద్రనాథ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అవార్డుకు ఎంపికయ్యారు. దక్షిణ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ అసోసియేషన్ వారు సాహిత్యం, విద్య, సామాజిక సేవారంగాల్లో కృషి చేసిన ప్రముఖులకు ఈ అవార్డు ప్రదానం చేయడం జరుగుతుంది. సాహిత్యం, విద్య, సామాజిక సేవారంగాల్లో విశేషమైన కృషిచేస్తూ, ఎందరికో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న డాక్టర్ రవీంద్రనాథ్ అవార్డుకు ఎంపిక కావడం పట్ల విద్యావేత్తలు, పలువురు పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఏప్రిల్ 13వతేదీన గుంటూరు శ్రీ వేంకటేశ్వరా విజ్ఞానమందిరంలో అవార్డును స్వీకరించడం జరుగుతుందని తెలిపారు.

ఘనంగా రథోత్సవం



నందవరంలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బనగానపల్లె, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందవరం గ్రామంలో ఉగాది బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం చౌడేశ్వరిదేవి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 5 గంటల సమయంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఈవో జి.కామేశ్వరమ్మ, ఆలయ మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి,గ్రామ పెద్దల ఆధ్వర్యంలో రథంపై అమ్మవారి ఉత్సవమూర్తులను కూర్చొబెట్టి సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంగళవాయిద్యాల, మేళతాళాల మధ్యలు అధిక సంఖ్యలో భక్తులు చౌడేశ్వరిదేవిని స్మరిస్తూ రథాన్ని లాగుతూ ఆలయం వద్ద చేరుకోవడంతో రథోత్సవం ముగిసింది.

ఓటరుగా నమోదు చేయాలి



ఆళ్లగడ్డలో సూచనలిస్తున్న నంద్యాల ఆర్డీవో చల్లా విశ్వనాథ్

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : 18సంవత్సరాలు నిండిన యువతీ యువకులను ఓటరుగా నమోదు చేయాలని ఆర్డీవో చల్లా విశ్వనాథ్ అన్నారు. ఆళ్లగడ్డలోని వైపీపీ ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ఎన్నికలకు సంబంధించి బూత్ లెవెల్ అధికారులకు సమా వేశం నిర్వహించారు. నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ పాల్గొని ఫారం 6, 7, 8 గురించి బూత్ లెవెల్ అధికారులకు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటును నమోదు చేసుకోవా లన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బనగానపల్లె : అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేయించాలని బనగానపల్లె నియోజకవర్గం స్పెషల్ అధికారి రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బనగానపల్లె ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో పొదుపు భవనంలో బనగానపల్లె, కోవెలకుంట్ల, సంజామల మండలాలకు చెందిన బూత్‌లెవల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్లు అనిల్‌కుమార్, పవన్‌కుమార్ రెడ్డి, బనగానపల్లె డీటీ మంజులవాణి, బూత్‌లెవెల్ అధికారులు, ఆయా మండలాల తహసీల్దారు సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

కోవెలకుంట్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాలుగు, ఐదు సచివాలయాలను శుక్రవారం మలేరియా నివారణ జిల్లా అధికారి కామేశ్వర్‌రావు తనిఖీ చేశారు. అందులో భాగంగా రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా స్కూల్ పిల్లల ఆరోగ్య పరీక్షలను, ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీల పనితీరును సమీక్షించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా నీటి గచ్చులను పరిశీలించి దోమల నివారణకు ఆరోగ్య సిబ్బంది సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసరు విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల దాహం తీర్చేందుకు చర్యలు

చాగలమర్రి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.వనిపెంట, పెద్దవంగలి నల్లమల అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల దాహం తీర్చే చర్యల్లో భాగంగా సాసర్‌పీట్లను (నీటికుంటలు) నీటితో నింపుతున్నట్లు ఎఫ్‌వో రామకృష్ణ తెలిపారు. అటవీశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మే రకు ఎం.తండా అటవీ ప్రాంతంలో ఉన్న సాసర్‌పీట్లలో నీటిని నింపా రు. కార్యక్రమంలో అటవీశాఖ సహాయ అధికారులు నాగేష్, సుభాష్, మదన్‌గోపాల్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

వడదెబ్బతో అప్రమత్తంగా ఉండాలి

దొర్నిపాడు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎండాకాలం కావడంతో ప్రజలు వడదెబ్బకు గురవకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి హుసేన్ సూచించారు. శుక్రవారం మండలంలోని డబ్ల్యూ.కొత్తపల్లె గ్రామంలో ప్రధానమంత్రి యోజన కింద మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డబ్ల్యూ.కొత్తపల్లె వైద్యాధికారి హుసేన్, ల్యాబ్ టెక్నీషియన్ ధిరజ్‌బాష, సూపర్‌వైజర్ భాగ్యమ్మ, హెల్త్ అసిస్టెంట్ రాముడు తదితరులున్నారు.

వైభవంగా శ్రీరామ నవమి ఉత్సవాలు

చాగలమర్రి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని పట్టాభిరామ, కోదండరామ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో శ్రీరామనవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం వాసవీ మాత, సీతారాములకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కోదండ రామాలయంలో సీతారాముల పల్లకి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. 6న శ్రీరామనవమి సందర్భంగా ఆలయాల్లో కల్యాణోత్సవం, సాయినాథ పల్లకి ఉత్సవం నిర్వహించబడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, ఎస్ఐ సురేష్ సూచించారు. మండలంలోని చిన్నవంగలి గ్రామంలో శుక్రవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. గ్రామంలో ప్రజలు, ఆయా పార్టీ నాయకులు కలిసి మెలసి ఐకమత్యంతో పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. గ్రామోత్సవాలు, ఎద్దుల పందెంలను ప్రశాంత వాతావరణంలో కొనసాగేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

ఏమిట్రీ వింత!



చాగలమర్రి సెయింట్‌ఆన్స్ పాఠశాలలో పచ్చని, ఎండిన చెట్లు

చాగలమర్రి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పచ్చదనంతో కళకళలాడుతున్న వృక్షం ఓవైపు, ఆకులు రాలిపోయి ఎండిన చెట్టు మరో వైపు. ఈ రెండు పక్క పక్కనే ఉన్నా భిన్న పరిస్థితుల్లో కనిపిస్తున్నాయి. చాగలమర్రి మండల కేంద్రంలో ఈ దృశ్యం అందరిని ఆకర్షిస్తోంది. ఆశా, నిరాశ వాదానికి ప్రతిరూపాలుగా ఇవి కనిపిస్తున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ దృశ్యాన్ని శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది.

ఏళ్లుగా ఎదురుచూపులే..!

- 'ఉపాధి'తో ఆసరా కల్పించాలని కోరుతున్న అన్నదాతలు
- నిర్లక్ష్యం వహిస్తున్న ప్రభుత్వాలు
- సీజన్‌లో కూలీలు దొరక్క అవస్థలు



కొండల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి .. రైతులు ఊతమిచ్చేలా కానరావడం లేదు. అన్నదాతను ఆదుకుంటామని పాలకులు గుప్పిస్తున్న హామీలు నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. వ్యవసాయానికి ఆసరాగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో ఏళ్లుగా ఊరిస్తూ ఉసురు మనిపిస్తు న్నాయి. కష్టాల్లో ఉన్న తమకు ఆర్థిక వెసులుబాటు లభిస్తుందని ఆశలు పెంచుకున్న రైతన్నలకు భంగపాటే ఎదురవుతోంది. వ్యవసాయ పనులకు ఉపాధి పథకాన్ని అనుసంధానం చేస్తే సీజన్‌లో అన్నదాతకు చేయూతతో పాటు, కూలీలకు పెద్ద ఎత్తున పనులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నది.

ఉపాధి నిధులు తమకు నచ్చినట్లు వినియోగిస్తున్న ప్రభుత్వాలు

కేంద్ర ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున రాష్ట్రానికి వచ్చే ఉపాధి హామీ పథకం నిధులను ప్రభుత్వాలు తమకు నచ్చిన పనులకు వినియోగిస్తున్నాయి. రాష్ట్రంలో గత తెలుగుదేశం ప్రభుత్వం ఉపాధి నిధులను అత్యధికంగా నీరు-చెట్టు పనులకు వినియోగించింది. ఆతర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ భవనాలు, ఇతర అభివృద్ధి భవనాల పేరుతో వినియోగించారు. సకాలంలో కూలి కూడా చెల్లించని పరిస్థితులు నెలకొనడంతో కూలీలు ఉపాధి పనులకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో గతంతో పోల్చుకుంటే ఉపాధి పనులకు వెళ్లే వారి సంఖ్య సగానికి పడిపోయినట్లు అధికార గణాంకాలే చెబుతున్నాయి.

భారంగా మారుతున్న వ్యవసాయం

సహకరించని ప్రకృతి, సహాయమందించని ప్రభుత్వాలతో రైతన్నకు వ్యవసాయం భారంగా మారుతోంది. పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, సాగులో అమాంతం పెరిగిన ఖర్చుల కారణంగా అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. వరి నాట్లు, కలుపుతీయడం, విత్తు నాటడం, పంట కోతలు ఇలా సాగు నుంచి నూర్పిడి వరకు రైతులకు ఎకరాకు రూ15-20 వేల వరకు కూలీ పనుల కోసం చెల్లిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఉపాధి పనులను వ్యవసాయానికి అనుసంధానం చేస్తే అన్నదాతకు కొండంత అండగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వాలు చిత్త శుద్ధితో ఆలోచించి, ఉపాధిని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని రైతులు, రైతు కూలీలు, ప్రజా సంఘాలు నాయకులు కోరుతున్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదు



గతంలో బీజేపీ, తెలుగుదేశం, వైసీపీ ఇలా అన్ని పార్టీలు ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చాయి. ఎంతో ప్రాధాన్యం కలిగిన రైతుల అంశంపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదు. ఇప్పటికైనా ఆదిశగా ప్రభుత్వాలు ఆలోచించాలి.

\- పీడతల దావీదు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

రైతులను ఆదుకోవాలి



వ్యవసాయ సీజన్‌లో రైతులకు కూలీలు దొరక్క ఇబ్బందులు పడే పరిస్థితులు అనేకం ఉన్నాం. కష్టాల్లో ఉన్న వ్యవసాయాన్ని గట్టెక్కించాలంటే ఉపాధి అనుసంధానం ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసి, రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

\- గూడూరు మహేశ్వరరెడ్డి, రైతు కొలిమిగుండ్ల

అకాల వర్షంతో రైతుల అవస్థలు



అవుకులో నేలకొరిగిన వరి



చాగలమర్రిలో అకాల వర్షానికి తడిచిన మొక్కజొన్న ధాన్యం

అవుకు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గత రాత్రి కురిసిన వర్షంతో వరి, మిరప, పొగాకు, మొక్కజొన్న పంటలను సాగుచేసిన రైతుల అవస్థలు వర్ణనాతీతంగా మారింది. మండలంలో 9.6 మిల్లీమీటర్లు వర్షం పడింది. గాలి, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడటంతో కోతదశకు వచ్చిన వరిపంట దాదాపు 500 ఎకరాల్లో నేలకొరిగింది. రైతులు మిరప, పొగాకు, మొక్కజొన్న పంటలను కోసి కల్లాలు, పొలాల్లో ఆరబెట్టారు. అకాల వర్షంతో ఆరబోసిన మిరప, పొగాకు, మొక్కజొన్న పంటలు వర్షానికి తడిసిపోయాయి.

చాగలమర్రి: మండలంలో ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఆయా గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున తేలికపాటి వర్షం కురిసింది. 4.40 మీ.మీ వర్షపాతం నమోదైంది. ఈ వర్షంతో మొక్కజొన్న, సజ్జ, నువ్వు పంటలు తడిచి రైతులకు నష్టం వాటిల్లింది. చాగలమర్రి సర్వీసు రహదారుల్లో ఆరబెట్టుకున్న మొక్కజొన్న తడిచి దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కజొన్న ధాన్యంపై కప్పిన పట్టలపై నిలిచిన వర్షపు నీటిని రైతులు తొలగించి ఆరబెట్టుకున్నారు. కేపీ తండా, ఎం.తండా, మూడురాళ్లపల్లె, చింతలచెరువు తదితర గ్రామాల్లో 500 ఎకరాల దాక సజ్జ పంట తడిచి దెబ్బతింది. కొందరు రైతులు నూర్పిడి చేసి ఆరబెట్టుకున్న సొద్ద ధాన్యం తడిచి పోయింది. మామిడి చెట్లకు కాయలు రాలి కౌలు రైతులు నష్టపోయారు.

శిరివెళ్ల : మండలంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షంతో వరి పైర్లు నేలవాలాయి. శిరివెళ్ల, యర్రగుంట్ల, కోటపాడు తదితర గ్రామాల్లో చేతికొచ్చిన వరి పైరు నేలవాలడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆళ్లగడ్డ : నంద్యాల డివిజన్‌లోని 13 మండలాల్లో 242.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆళ్లగడ్డ వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గడివేములలో అత్యధికంగా 100.4 మి.మీ వర్షపాతం నమోదుకాగా అత్యల్పంగా దొర్నిపాడులో 0.2 మి.మీ వర్షపా తం నమోదైందన్నారు.

రుద్రవరం : మండలంలో గురువారం రాత్రి అకాల వర్షం కురిసింది. కోటకొండ, శ్రీరంగాపురం గ్రామాల్లో మొక్కజొన్న రైతులు నష్టపోయారు. అలాగే రుద్రవరం సమీపంలో ఆరబెట్టిన పసుపు కొమ్ము లు తడిచిపోయాయి. వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు లారీలు, ట్రాక్టర్లలో వరి ధాన్యం బస్తాలు తరలించారు. మరికొందరు టార్పలిన్ కప్పి ఉంచారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తులు

బనగానపల్లె, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2025-26 సంవత్సరానికి ఆరోతరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నట్లు కస్తూర్బా ప్రిన్సిపాల్ సునీత శుక్రవారం తెలిపారు. దరఖాస్తు స్వీకరణకు ఈనెల 11వరకు చివరి గడువు అన్నారు.

ఆత్మహత్య ఘటనపై సీఐ విచారణ



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంకిరెడ్డిపల్లెలో గురువారం జరిగిన కార్మికుడు ఉమ్మడి వెంకటరామిరెడ్డి ఆత్మహ త్య ఘటనపై కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు శుక్రవారం సాయంత్రం విచారణ చేపట్టారు. మృతుడు సూసైడ్ నోట్‌లో మరో వ్యక్తి పేరు రాసి ఉండటంతో విచారణ చేపట్టారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, చుట్టు పక్కల వారితో పాటు, బాధిత కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేక రించారు. ఏమైనా అనుమానాలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఏఎస్ఐ బాబాఫకృద్దీన్ పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వివిధ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణ కోసం ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నామని మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కరీముల్లా శుక్రవారం వెల్లడించారు. మండలంలోని బందార్లపల్లె గ్రామంలో కళ్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా ప్రారంభించారు. మండలంలోని అల్ట్రాటెక్, రామ్‌కో సిమెంట్ పరిశ్రమ వారి సహాయంతో సుమారు పది గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నామన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

బనగానపల్లె, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని రాయలసీమ ప్రాంతీయ పర్యావరణ సమన్వయ కర్త కుమార్ బాబు అన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్, నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో సంయుక్తంగా యాగంటి గుహల వద్ద ప్రత్యేక ప్రకృతి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పర్యావరణ పరిరక్షణలో తాము కూడా భాగస్వామ్యులవుతామని వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. శిబిరంలో వ్యాయామ ఉపాధ్యాయుడు సురేంద్రారెడ్డి, ఉ పాధ్యాయులు సుబ్బరాయుడు, నూర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

కట్టలు కట్టుకోవాలి : ఏవో

అవుకు, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : గాలి వర్షానికి నేలకొరిగిన వరిపంటను రైతులు కట్టలు కట్టుకోవాలని వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్ అన్నారు. శుక్రవారం శింగనపల్లె, గుండ్లశింగవరం గ్రామాల్లో నేలకొరిగిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ పొలాల్లో ఉన్న నీటిని బయటకు తరలించి నేలకొరిగిన వరిని కట్టలుగా కట్టుకోవాలన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు బీమా

శిరివెళ్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు బీమా సౌకర్యం ఉంటుందని మాజీ ఎంపీటీసీ కొండబోయిన బాలచంద్రుడు అన్నారు. శిరివెళ్లలోని 96వ బూత్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్డులను శుక్రవారం కార్యకర్తలకు పంపిణీ చేశారు. టీడీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, కార్యకర్తలకు ఇస్తున్న భరోసాతో ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారన్నారు. టీడీపీలో భాగస్వామ్యులైన ప్రతి కార్యకర్తకు పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు.

బనగానపల్లె : టీడీపీ సభ్యత్వం కార్డులతో కార్యకర్తలకు అన్ని విధాలా రక్షణ ఉంటుందని టీడీపీ నాయకుడు మిట్టపల్లె సర్పంచ్ అన్నారు. శుక్రవారం కాపులపల్లె గ్రామంలో టీడీపీ సభ్యత్వ కార్డులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి, కృష్ణారెడ్డి, అంకిరెడ్డి, భాష, రామచంద్రారెడ్డి, శేఖర్‌రెడ్డి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కోవెలకుంట్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పేరా బిల్డింగు సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. వారి వద్ద నుంచి రూ.14400 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

డోన్ టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ పట్టణ కార్యదర్శి కే.రాజకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండీ ఆనంద్‌బాబు, సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు కే.రంగమ్మ, ఐద్వా పట్టణ నాయకులు షమీమ్ భేగం డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణం లోని స్థానిక తపాలా కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ధర్నా చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయ కులు జయమ్మ, యోగానంద్, ఐద్వా మాదవిలత, సూర్య పద్మావతి, షబానా, కరీం షాబుద్దీన్, ప్రవీణ్, రమేష్‌కుమార్, బ్రహ్మం నాగరాజు, షంషీర్‌రావూఫ్ తదితరులున్నారు.

అద్దె చెల్లించని దుకాణాలకు తాళాలు



మున్సిపల్ కాంప్లెక్స్‌లోని దుకాణానికి తాళం వేస్తున్న సిబ్బంది

డోన్ టౌన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో అద్దె చెల్లించని షాపులకు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, ఆర్వో వెంకటరెడ్డి సిబ్బంది తాళాలు వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొంత మంది దుకాణాలకు అద్దె చెల్లించడం లేదన్నారు. అలాంటి వాటిని గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆయన వెంట ఆర్ఐ మోహన్, సిబ్బంది శిరీష్, తదితరులు ఉన్నారు.

పీసీసీ మాజీ అధ్యక్షుడికి స్వాగతం



రఘువీరారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

డోన్ రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్ర జ్యోతి): పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరా రెడ్డి శుక్రవారం కర్నూలుకు వెళ్తూ మార్గమధ్యలో డోన్ హైవేపై కాసేపు ఆగారు. కాంగ్రెస్ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి, డీసీసీ ఉపాధ్యక్షుడు మల్లెంపల్లె జనార్దన్ తదితరులు ఆయనకు స్వాగతం పలికి సన్మానించారు. నాయకులతో కాసేపు ముచ్చటించి అక్కడి నుంచి కర్నూలులో జరుగుతున్న జాతీయ రైతు సదస్సుకు హాజరయ్యేందుకు బయలుదేరి వెళ్లారు.

'సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి'

బేతంచెర్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి భార్గవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో సీపీఐ నంద్యాల జిల్లా స్థాయిలో మండల, పట్టణ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు, పట్టణ కార్యదర్శులు హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో తిరుమలేష్ చౌదరి, ఏఐఎస్ఎఫ్ ఉపాధ్యక్షులు ఉదయ్, నాయకులు శ్రీరాములు, నాగేశ్వరరావు, శ్రీను, రవి, సాయి పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పిస్తాం: ఏపీవో

బేతంచెర్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో అర్హులందరికీ ఉపాధి హామీ పనులు కల్పిస్తామని ఏపీవో విజయరాణి అన్నారు. శుక్రవారం బేతంచెర్ల ఏపీవోగా విజయరాణి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాణ్యం నుంచి బదిలీపై వచ్చినట్లు తెలిపారు.

నీటి తొట్ల ఏర్పాటు

ప్యాపిలి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలచెట్ల గ్రామంలో పోతిరెడ్డి ధీరజ్ రెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో పశువులకు నీటి తొట్లు ఏర్పాటు చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తొట్లు నిర్మించినట్లు సొసైటీ నిర్వాహకులు పోతిరెడ్డి భూమిశ్రీ తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామని ఆమె తెలిపారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా వేణుగోపాల్

కోవెలకుంట్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్లలోని శ్రీవాసవి బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎం.వేణుగోపాల్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరులో బీఈడి కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తూ బదిలీపై వచ్చారు. కళాశాల సిబ్బంది స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు ఉన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

కోవెలకుంట్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : అనాథ శవానికి విక్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. కొంతకాలంగా పట్టణంలోని బస్టాండు సమీపంలో భిక్షాటన చేస్తూ యాచక వృద్ధుడు (70) జీవనం సాగించేవాడు. బస్టాండులో టీ కొట్టు పక్కనే దుకాణం ముందు పడి మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సంఘట నాస్థలాన్ని చేరుకుని ఆ మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. అయితే బంధువులు ఎవరూ రాకపోవడంతో విషయం తెలుసుకున్న విక్కీఫౌండేషన్ సభ్యులు అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

ఎర్రవంకకు జలకళ

చాగలమర్రి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి మూడురాళ్లపల్లె గ్రామ సమీపంలోగల ఎర్రవంక జలకళ సంతరించుకుంది. రెండు నెలల నుంచి నీరు లేక ఒట్టిపోయింది. అకాల వర్షంతో వంకలో వర్షపు నీరు ప్రవహించింది. తేలికపాటి వర్షం కురవడంతో వారం రోజుల నుంచి ఎండవేడిమితో అల్లాడుతున్న ప్రజలకు ఊరటనిచ్చింది.

'వక్ఫ్ బిల్లును రద్దు చేయాలి'

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : లౌకికవాదం, మత స్వేచ్ఛను దెబ్బతీసేలా ఉన్న వక్ఫ్ బిల్లును రద్దు చేయాలని సీపీఎం ఆళ్లగడ్డ ఏరియా కార్యదర్శి రామచంద్రుడు, జిల్లా నాయకుడు బాల వెంకట్ డిమాండ్ చేశారు. సీపీఎం కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో మత ఉద్రిక్తతలను పెంచి పోషించుటకు, ముస్లిం మైనార్టీల హక్కులకు భంగం కలిగిస్తూ వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టడం కోసం వక్ఫ్ సవరణ బిల్లును ఆమోదించిందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల న్నారు.

6న చిన్నవంగలిలో ట్రాక్టర్ రివర్స్ పందెం

చాగలమర్రి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవంగలి గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా ట్రాక్టర్ రివర్స్ పందెం పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 6న ఈ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే గాడిద పందెం పోటీలు ఏర్పాటు చేశామన్నారు. పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

చేతిపంపునకు మరమ్మతులు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేతిపంపు ద్వారా దాహం తీర్చుకుంటున్న విద్యార్థిని

రుద్రవరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దక్షిణకొట్టాలు గ్రామంలో మర మ్మతుకు నోచు కోని చేతి పంపు అనే శీర్షిక 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురిత మైంది. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం స్పందించి చేతిపంపునకు మరమ్మతులు చే యించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్ పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న స్టేట్ అబ్జర్వర్ హైమేశ్వరరావు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్‌ను ఆ విభాగం స్టేట్ అబ్జర్వర్ హైమేశ్వరరావు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎంఈవో కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి, పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్‌వో దస్త గిరిరెడ్డి, ఎంఈవో అబ్దుల్‌కలాం, హెచ్‌ఎం హుసేనయ్య, ఉపాధ్యాయులు, సీఆర్‌పి మద్దిలేటి, కమల, కాంతారావు పాల్గొన్నారు.